పెన్ పవర్
తెలంగాణ రౌండప్



U.C.-SHOWCAUSE NOTICE

CYBERABAD MUNICIPAL CORPORATION

O/o the Deputy Commissioner,
Dundigal Circle-59,
CMC, Hyderabad.

Notice No. /TPS/DUND/C-59/CMC/2026 Dt:09-10-2026

SHOW CAUSE NOTICE

Sub:- Sub: CMC – Dundigal Circle-59 – Town Planning Section – Unauthorized deviation/raising of setbacks against the permitted Ground + 2 Upper Floors in Plot No. 31 (Part, North Side Portion), Sy. No. 134, situated at Greenhills Colony, Bahadurpally Village, Dundigal Gandimaisamma Mandal – Show Cause Notice under the provisions of the GHMC Act, 1955 read with Section 10 of the TS-bPASS Act, 2020 – Issued – Regarding

Ref:- Prajavani Complaint No. 2809266169937, dated 28.09.2026, filed by Sri Gaddam Srinivasu requesting to stop the encroachment of the road at Greenhills Colony, Road No. 1, Bahadurpally.

******

Whereas, it has come to the notice of this office that while the construction of Ground + 2 Upper Floors is within sanctioned limits, unauthorized deviations have been made regarding the required setbacks in **Plot No. 31 (Part, North Side Portion), Sy. No. 134, situated at Greenhills Colony, Bahadurpally Village, Dundigal Gandimaisamma Mandal**. These deviations are contrary to the provisions of the GHMC Act, 1955, the Building Bye-Laws made thereunder, and the TS-bPASS Act, 2020.

The details of un-authorized construction are given below.

**Unauthorized raising and violation of required setbacks (against the permitted Ground + 2 upper floors structure) & Eencroachment of Road**

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి నుండి జారీ చేసిన అసంపూర్తి వివరాలతో షోకాజ్ నోటీసులు..9వ తేదీగా నమోదు..



Therefore, you are hereby directed to show sufficient cause by a statement in writing within **fifteen (15) days** from the date of receipt of this notice as to why the aforesaid unauthorized setback deviations should not be rectified or demolished departmentally. Furthermore, you are directed to **stop all unauthorized construction work forthwith** and appear before the undersigned on **14-10-2026 at 3:00 PM** in the Chambers of the Deputy Commissioner for a personal hearing to present your case, submitting oral and written pleadings along with supporting documents. Failing this, it will be construed that you have no explanation to offer and are unwilling to attend personally, and further penal action will be initiated as per the rules in force.

Deputy Commissioner,
Dundigal Circle-59,
CMC.

To, V. Ravi Shekr 7013488736
1. Sri. VALLEPU RAVI SHANKAR & OTHERS,
Plot No. 31/Part North Side Portion
Sy No.134, Situated at Greenhills Colony,
Bahadurpally, Gandimaiamma Mandal.

2. Gaddam Srinivasulu
Green Hills Colony,
Bahadurpally Ward
Dundigal Circle -59.

13/10/2026
Time 16:42

నోటీసుల స్వీకరణ తేదీ 13గా స్పష్టం..

# అక్రమ నిర్మాణాన్ని..
# 'ఓపెన్ ప్లాట్'గా రిజిస్ట్రేషన్‌లా..?

- దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారుల నిర్లక్ష్యం ఒకవైపు.. బిల్డర్ అత్యుత్సాహం మరోవైపు..
- సిఎంసి నోటీసులు బేఖాతర్.. సీజ్‌చేసిన భవనాన్ని, సదరు బిల్డర్ ఓపెన్ ప్లాట్‌గా చూపి రిజిస్ట్రేషన్..?
- రోడ్డు కబ్జాపై ఆరోపణలు- నిబంధనలు ఉల్లంఘన.. గ్రీన్‌హిల్స్ కాలనీలో అక్రమ కట్టడంపై ఫిర్యాదులు..
- సెట్‌బ్యాకులకు తూట్లు.. అనుమతులు గ్రౌండ్ ప్లస్ 2.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణమంటూ నోటీసులు..
- నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన అధికారులు నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటారా..?
- ఇప్పటి వరకూ దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారుల చర్యలు మొత్తం అక్రమార్కులకు సహకరించేవే కదా..
- టౌన్‌ప్లానింగ్ అధికారుల ట్రాక్ రికార్డుపై, లేవనెత్తుతున్న స్థానికుల ప్రశ్నలు..
- సిఎంసి ఉన్నతాధికారులకు తెలిసే ఈ అక్రమ నిర్మాణాల దందా వ్యవహారం కొనసాగుతోందా..?
- తూతూ మంత్రపు చర్యల ఫొటోలు గ్రూపులో పడేసిన అధికారులు..
- గ్రీన్‌హిల్స్ కాలనీలో భవనాన్ని సీజ్‌చేసిన ఫొటోలు గ్రూపులో ఎందుకు పోస్ట్ చేయలేదు..?
- అక్టోబర్ 9న షోకాజ్.. అక్టోబర్ 12న రిజిస్ట్రేషన్ చేసినట్లు ఈసీలో నమోదు..!
- జూలై 7 ఫిర్యాదుపై ఏం చేశారు..? అధికారుల నిర్లక్ష్యం ఉందా..? బాధ్యులెవరో తేల్చాలని స్థానికుల డిమాండ్..
- షోకాజ్ నోటీసులో బిల్డింగ్ పర్మిషన్ నెంబర్, మంజూరైన అనుమతి వివరాలు లేకపోవడంపై అనుమానాలు..
- అసలు అనుమతి ఉందా లేదా..? గ్రౌండ్ ప్లస్ 2 అంతస్తులకు అనుమతి ఉందని నోటీసులో ప్రస్తావన..
- పర్మిట్ నంబర్ వెల్లడించకపోవడంతో.. అసలు అనుమతి పత్రాలపైనే తలెత్తుతున్న ప్రశ్నలు..
- నిర్మాణ అనుమతులు, సీజ్ రికార్డులపై అనుమానాలు నివృత్తి చేయాలన్న ఫిర్యాదు దారుడు..
- రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలించి వాస్తవాలు వెల్లడించాలని స్థానికుల డిమాండ్..

-4లో

- 9న నోటీసులు.. 12న ప్లాట్‌గా రిజిస్ట్రేషన్..15న అక్రమ భవనం సీజ్..
- అనుమతుల ప్రస్తావన లేకుండానే నోటీసులు జారీ.. గ్రీన్ హిల్స్ కాలనీలో రాస్తా కబ్జా రగడ..
- రోడ్డును ఆక్రమించి-నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణం..! అదే భవనాన్ని 'ఓపెన్ ప్లాట్'గా రిజిస్ట్రేషన్..?




గ్రీన్‌హిల్స్ కాలనీలో సీజ్ చేసిన అక్రమ నిర్మాణం..




రోడ్డును ఆక్రమించినట్టు తెలియజేసే జూలై నెలలో తీసిన నిర్మాణం..

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 21:** అక్రమ నిర్మాణం కన్‌స్ట్రక్షన్ దశలో ఉండగానే.. సదరు నిర్మాణాన్ని గోప్యంగా ఉంచి.. ఓపెన్ ప్లాట్‌గా తప్పుడు రిజిస్ట్రేషన్ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలో రోడ్డు ఆక్రమణ, సెట్‌బ్యాకుల ఉల్లంఘన ఆరోపణలతో వివాదం.. నిబంధనల ఉల్లంఘనలపై మున్సిపల్ షోకాజ్ నోటీసులు.. నిర్మాణాన్ని సీజ్ చేసినట్లు అధికారులు జారీచేసిన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు..! అయినా అదే స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ లావాదేవీలలో 'ఓపెన్ ప్లాట్'గా నమోదు కావడంపై అనుమానాలు వ్యక్తం అవుతుండగా..! మరోవైపు, నోటీసులోనూ బిల్డింగ్ పర్మిట్ నెంబర్, అనుమతి వివరాల ప్రస్తావన లేకపోవడం కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అసలు నిర్మాణానికి అనుమతి ఉందా..? ఉంటే పర్మిట్ వివరాలను నోటీసులో ఎందుకు పేర్కొనలేదు..? మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమా..? బిల్డర్ అత్యుత్సాహానికి అధికారుల సహకారమా..? రిజిస్ట్రేషన్ శాఖ విచారణతోనే వాస్తవాలు తేల్చాలని కోరుతున్నారు.. రిజిస్ట్రేషన్ ఫీజులు తప్పించుకునే ధోరణితో నిర్మాణం ఉన్నప్పటికీ..! ఓపెన్ ప్లాట్‌గా విక్రయించి రిజిస్ట్రేషన్ చేయడంపై విచారణ జరిపి కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. మరోవైపు అసంపూర్తి వివరాలతో నోటీసులు జారీ చేసిన దుండిగల్ సర్కిల్-59 అధికారులపైనా సిఎంసి కమిషనర్ విచారణ జరిపించాలని ఫిర్యాదు దారుడు కోరారు..

## దసరా ఆత్మీయ సమ్మేళనం..
## నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్..




**హైదరాబాద్ పెన్ పవర్:** దసరా పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 2026 అక్టోబర్ 22 (గురువారం) కొడంగల్ వెళ్లనున్నారు. దసరా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులను కలిసేందుకు సొంత నియోజకవర్గమైన కొండగల్ కు సీఎం వెళ్లనున్నారు. ఉదయం 11.50 గంటలకు బేగంపేట్ ఓయిర్ పోర్టు నుంచి బయలుదేరి కొడంగల్ చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30 నుంచి 3.30 వరకు ప్రజలతో సమావేశం అవుతారు. దసరా సమ్మేళనంలో పాల్గొంటారు. 4 గంటలకు హైదరాబాద్ బయల్దేరుతారు. పండుగడెకర్ కొనండి సొంత నియోజకవర్గానికి సీఎం రాకతో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు సీఎం దసరా సమ్మేళనంలో పాల్గొననున్నారు.

## డంప్‌యార్డుపై పోరు.. ఈ నెల 27 నుంచి
# ఎంపీ ఈటల పాదయాత్ర



**హైదరాబాద్ పెన్ పవర్:** జవహర్ నగర్ డంప్‌యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. డంప్ యార్డు నుంచి వెలువడుతున్న మీథేన్ గ్యాస్‌తో పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 23న జవహర్ నగర్ బాధితులతో సమావేశం, 25న పర్యావరణవేత్తలు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి డంప్ యార్డుకు వ్యతిరేకంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. చెత్త నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు.



## 'నార్లాపూర్' నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీరు విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్::** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో పర్యటించిన ఆయన.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి 1000 క్యూసెక్కుల నీటిని ఎల్లూరు జలాశయంలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వదిలేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు నీటిని విడుదల చేయాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు.
ఈ 1000 క్యూసెక్కుల నీటి విడుదలతో మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి నియోజకవర్గాల్లో అదనంగా లక్ష ఎకరాలకు

- మిగతా 5లో...

# అక్రమ నిర్మాణాన్ని.. 'ఓపెన్ ప్లాట్'గా రిజిస్ట్రేషన్‌లా..?

Sun Oct 18 2026 10:40:0 PM

Registration & Stamps Department
Government of Telangana

**STATEMENT OF ENCUMBRANCE ON PROPERTY**

**Application Number:** 674415 **Statement Number:** 238565962

Having searched for a statement giving particulars of registered acts and encumbrances if any, in respect of the under mentioned property
Village: BAHADURPALLE, Ward - Block: 0 - 0, Plot Number: 31/P, Survey Number: 134/P, Extent: 100 Y Bounded by NORTH: 25 WIDE ROAD, SOUTH: Plot No.31/Part, EAST: Plot No.30, WEST: 25 WIDE ROAD

Search has been made in **Book 1** and in the indexes relating to **43** years from 01-01-1983 to 16-10-2026 for acts and encumbrances affecting the said property, and that on such search the following acts and encumbrances appear.

| Sl. No. | Description of the Property | Registration Date Execution Date Presentation Date | Nature of Deed Market Value Consideration Value | Name of Parties Executant (EX) & Claimants (CL) | Vol/Pg No. CD No. Doct No./Year [Schedule No.] SRO |
|---|---|---|---|---|---|
| 1/3 | VILL/COL: BAHADURPALLE/BAHADURPALLY VILLAGE, BAHADURPALLY X ROAD, M W-B: 0-0 SURVEY: 134/P PLOT: 31/P EXTENT: 100SQ.Yds Bounded by: [N]: 25' WIDE ROAD [S] Plot No.31/Part [E]: Plot No.30 [W]: 25' WIDE ROAD<br>Link Doct: 9331/1989 Book-1 of SRO 1504<br>Link Doct: 4750/2026 Book-1 of SRO 1504 | (R) 12-10-2026<br>(E) 12-10-2026<br>(P) 12-10-2026 | 0101<br>SALE DEED<br>Mkt.Value:Rs. 1050000<br>Cons.Value:Rs. 1050000 | 1.(CL)THOTA NAGARAJU<br>2.(EX)G.RADHAMMA<br>3.(EX)VALLEPU RAVI SHANKAR | 0/0<br>14187/2026 [1] of SRO MEDCHAL (R.O)(1504) |
| 2/3 | VILL/COL: BAHADURPALLE/BAHADURPALLY VILLAGE, BAHADURPALLY X ROAD, M W-B: 0-0 SURVEY: 134/P PLOT: 31/P EXTENT: 100SQ. Yds NORTH SIDE PORTION OF PLOT IN 'GREEN HILLS HOUSING COLONY' Boundaries: [N]: 25' WIDE ROAD [S] Plot No.31/Part [E]: Plot No.30 [W]: 25' WIDE ROAD<br>Link Doct: 9331/1989 Book-1 of SRO 1504 | (R) 06-04-2026<br>(E) 06-04-2026<br>(P) 06-04-2026 | 0101<br>SALE DEED<br>Mkt.Value:Rs. 700000<br>Cons.Value:Rs. 700000 | 1.(CL)G.RADHAMMA<br>2.(EX)MAMIDALA KAMALA<br>3.(CL)VALLEPU RAVI SHANKAR | 0/0<br>4750/2026 [1] of SRO MEDCHAL (R.O)(1504) |
| 3/3 | VILL/COL: Bahadurpally W-B: 0-0 SURVEY: , 134 PART PLOT: , 31, APARTMENT / EXTENT: , 200 Y 167.2 M, Boundaries: [N]: 25 Ft Road [S] Pro 32 [E]: Pro 30 [W]: 25 Ft Road | (R) 16-12-1989<br>(E) 13-12-1989<br>(P) 13-12-1989 | 5A<br>SALE<br>Mkt.Value:Rs. 3000<br>Cons.Value:Rs. 3000 | 1.(E)Bhumaiah S And 12 Others<br>2.(R)Gpa 1 Pandiri 2 Lingaiah 3 Narsimha<br>3.(CL)Manjula Vemala | 1241/153<br>9331/1989 [@] of SRO MEDCHAL (R.O)(1504) |

**Note**
This Report is for Information only.
Boundaries, Extent and Built Up are not used in electronic search, they are meant for registering of fer for selecting or deselecting for the search results.
The encumbrances shown in the Encumbrance are those discovered with reference to the description of properties furnished by the applicants at the time of Registration.
All efforts are made for accuracy of data. However in case of any conf lict, original data shall prevail.
In case system responds by "Data Not Found", for conf irmation approach SRO concern.
Result: '3 out of 3 are included in the statement.'

ఓపెన్ ప్లాట్‌గా రిజిస్ట్రేషన్ చేసినట్లు ఈసీ..

-3 పేజి తరువాయి

ఒకవైపు కాలనీ రోడ్డును ఆక్రమించి, అనుమతులకు విరుద్ధంగా సెట్‌బ్యాకులను ఉల్లంఘిస్తూ నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు.. మరోవైపు ఫిర్యాదుల నేపథ్యంలో మున్సిపల్ అధికారుల షోకాజ్ నోటీసులు, నిర్మాణాన్ని సీజ్ చేసినట్లు కనిపిస్తున్న ఆధారాలు.. ఇంతలోనే అదే స్థలానికి సంబంధించిన భవనాన్ని ఖాళీ స్థలంగా చూపిస్తూ రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఈసీతో వెల్లడి.. వెరసి దుండిగల్ సర్కిల్-59 పరిధిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో చోటుచేసుకున్న ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది..

బహదూర్‌పల్లి గ్రామం, సర్వే నెంబర్: 134లోని ప్లాట్ నెంబర్ 31లో (భాగం, ఉత్తర వైపు) నిర్మాణానికి సంబంధించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 టౌన్ ప్లానింగ్ విభాగం 2026 అక్టోబర్ 9వ తేదీన షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు నోటీసు సూచిస్తుంది.. అనుమతించిన గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్తులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడం, అవసరమైన సెట్‌బ్యాకుల నిబంధనలు ఉల్లంఘించడం, రోడ్డు ఆక్రమణకు పాల్పడినట్లు ఫిర్యాదు రావడం ఈ నోటీసులో ప్రస్తావించారు..అదే సమయంలో, భవనంపై సీలింగ్ చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నదే..! అయితే, ఆ చర్యకు సంబంధించిన పూర్తి ఉత్తర్వులు, సీజ్ మెమో, అమలు నివేదికలను పరిశీలిస్తేనే సీజ్ తేదీ, పరిధి, అమలు స్థితిపై పూర్తి స్పష్టత వస్తుంది.. ఈ నేపథ్యంలో మరో కీలక ప్రశ్న తెరపైకి వస్తోంది.. అక్రమ నిర్మాణంగా గుర్తించి చర్యలు ప్రారంభించిన భవనం ఉన్న స్థలాన్నే, ఖాళీ ప్లాట్‌గా చూపుతూ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆశాఖ సైట్‌లో ఈసీతో బట్టబయలు అయింది..

## అక్టోబర్ 9న నోటీసు.. అక్టోబర్ 12న రిజిస్ట్రేషన్..!

ఈ వ్యవహారంలో తేదీల క్రమం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. మున్సిపల్ షోకాజ్ నోటీసు తేదీ అక్టోబర్ 9, 2026 కాగా, ఈసీలో సేల్ డీడ్ 2026 అక్టోబర్ 12న రిజిస్ట్రేషన్ అయినట్లు నమోదైంది.. నోటీసును ఫిర్యాదు దారుడు స్వీకరించిన చేతిరాత వివరాలు '2026 అక్టోబర్ 13' సూచిస్తున్నాయి. నిర్మాణం వద్ద సీజ్ టేపులు కనిపిస్తున్న ఫొటోలో 2026 అక్టోబర్ 15వ తేది నమోదైంది.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, నోటీసు జారీ అయిన తర్వాత జరిగినప్పటికీ, నోటీసు అందినట్లు కనిపిస్తున్న తేదీకి, సీజ్ టేపులతో ఉన్న ఫొటో తేదీకి ముందుగానే జరిగింది.. అయితే, భవనాన్ని వాస్తవంగా ఎప్పుడు సీజ్ చేశారు..? అంతకుముందే ఏవైనా చర్యలు తీసుకున్నారా..? అన్నది సీజ్ మెమో, అధికారిక తనిఖీ నివేదికల ద్వారా నిర్ధారించాలి.. ఇప్పుడు మేడ్చల్ రిజిస్ట్రేషన్ శాఖ విచారణ కీలకంగా మారబోతోంది.. రిజిస్ట్రేషన్‌కు ముందే ఆ స్థలంలో భవనం ఉన్న విషయం అధికారుల దృష్టికి వచ్చిందా..? సదరు ఆస్తి వివరాలను ఓపెన్ ప్లాట్‌గా నమోదు చేయడానికి ఏ పత్రాలను ప్రాతిపదికగా తీసుకున్నారు..? నిర్మాణం వాస్తవ స్థితిని పరిశీలించారా..? అన్న ప్రశ్నలకు దుండిగల్ మున్సిపల్ అధికారులు రిజిస్ట్రేషన్ శాఖ యంత్రాంగం సమాధానం ఇవ్వాలని స్థానికుల డిమాండ్..

## తాజా రిజిస్ట్రేషన్ వ్యవహారం.. ఈసీలో నమోదు..

తెలంగాణ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖకు చెందిన ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ)లోని వివరాలు ఈ వ్యవహారంలో మరో కీలక అంశాన్ని వెలుగులోకి తెస్తున్నాయి.. 2026 అక్టోబర్ 12న రిజిస్ట్రేషన్ లావాదేవీల ఈసీ ప్రకారం, బహదూర్‌పల్లి పరిధిలోని సర్వే నంబర్ 134/P, ప్లాట్ నెంబర్ 31/Pలో 100 చదరపు గజాల స్థలానికి సంబంధించి 2026లో రెండు సేల్ డీడ్ నమోదైంది.. 2026 అక్టోబర్ 12న, డాక్యుమెంట్ నెంబర్ 14187/2026. ఇదే 100 చదరపు గజాల స్థలానికి సంబంధించిన సేల్ డీడ్‌లో మార్కెట్ విలువ, రూ.10.50 లక్షలుగా పేర్కొన్నారు.. సంబంధిత ఈసీలో నలుదిక్కులు (తూర్పున, పశ్చిమా 25 ఫీట్ల రోడ్డు) కూడా ప్లాట్ వివరాలు, సరిహద్దులు కనిపిస్తున్నప్పటికీ..! నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించిన పూర్తి వివరాలు ఈసీ పట్టికలో స్పష్టంగా కనిపించడం లేదు.. స్థలంలో భవనం ఉన్న విషయం తెలిసి కూడా విక్రయ పత్రంలో దాన్ని ప్రస్తావించలేదా..? ఆ పత్రాన్ని సమర్పించినవారు, పరిశీలించిన అధికారులు స్థలంలోని వాస్తవ పరిస్థితులను ధ్రువీకరించారా..? అన్నది అసలు విచారణలో తేలాల్సిన అంశం..

## జూలై 7న డిప్యూటీ కమిషనర్‌కు.. సెప్టెంబర్ 28న సిఎంసిలో ఫిర్యాదు..

రోడ్డు ఆక్రమణపై జూలై 7నే ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు సకాలంలో స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.. అయితే షోకాజ్ నోటీసులో మాత్రం ప్రజావాణి ఫిర్యాదు నెంబర్ 2809266169937, తేదీ 28.09.2026గా పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు గడ్డం శ్రీనివాసు సమర్పించినదిగా, గ్రీన్‌హిల్స్ కాలనీ రోడ్ నంబర్ 1 వద్ద రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలని కోరినట్లుగా నోటీసులో ఉంది.. ఈ రెండు ఫిర్యాదులను ఒకే వ్యక్తి ఇచ్చినప్పటికీ..! జూలై 7 నాటి ఫిర్యాదుపై మున్సిపల్ అధికారులు ఏ చర్యలు తీసుకున్నారు..? సెప్టెంబర్ 28న ప్రజావాణిలో మళ్లీ ఫిర్యాదు చేసిన తర్వాతే టౌన్ ప్లానింగ్ విభాగం స్పందించడానికి నడుమ ఏం జరిగింది..? అన్న ప్రశ్నలు కీలకంగా తలెత్తుతున్నాయి.. అదేవిధంగా నోటీసులో ఒకవైపు 15 రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని పేర్కొంటూనే, అక్టోబర్ 14న మధ్యాహ్నం 3 గంటలకు వ్యక్తిగత విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.. స్వీకరణ తేదీ అక్టోబర్ 13గా కనిపిస్తున్న నేపథ్యంలో విచారణకు ఇచ్చిన వ్యవధి 24 గంటల లోపే ఉండటం స్థానికుల నుంచి తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.









**రోడ్డు ఆక్రమణ, నిబంధనలు ఉల్లంఘించిన సంబంధిత అక్రమ నిర్మాణం జూలై నుండి అంచెలంచెలుగా..**

# 'నార్లాపూర్' నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీరు విడుదల

-3 పేజి తరువాయి

సాగునీటి సదుపాయం కలగనుందని మంత్రి వివరించారు. సాగునీటితో పాటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోకుండా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని మంత్రి అన్నారు. నీటిని విడుదల చేయాలని కోరడం సులువేనని, అయితే ఆ నీరు కాలువల ద్వారా ఎక్కడికి చేరుతుందో కూడా ఆలోచించాలన్నారు. నిర్మాణ పనులు పూర్తికాకుండా నీటిని విడుదల చేస్తే ఆశించిన ప్రయోజనం ఉండదని తెలిపారు. ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించి వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని హితవు పలికారు. గాలి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నేడు రవీంద్రభారతి లో పండుగల సాయన్న 174 వ జయంతి వేడుకలు

**కరీంనగర్: పెన్ పవర్:** పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలు నేడు (ఈ నెల 22 తేదీన) రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు "మన ముదిరాజ్ మహాసభ " జిల్లా అధ్యక్షులు సిద్ధి సంపత్ ముదిరాజ్ తెలిపారు . ఈ వేడుకల వాల్ పోస్టర్ ఆవిష్కరణ బుధవారం రోజున కరీంనగర్ లోని అదితి హోటల్ లో ఆవిష్కరించడం జరిగింది . ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు మందా నగేష్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీనివాస్ ముదిరాజ్ , ఉపాధ్యక్షులు మల్లేశం ముదిరాజ్ , ముదిరాజ్ పిట్టల మధు , ముదిరాజ్ రమేష్ ముదిరాజ్ రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్ మరియు పట్టణ 14 సంఘాల జేఏసీ అధ్యక్షులు చిక్కుడు రాజయ్య ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి నిమ్మల కిషన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ముదిరాజ్ కుల సంఘాలకు "మన ముదిరాజ్ మహాసభ " జిల్లా అధ్యక్షులు సిద్ధి సంపత్ విజ్ఞప్తి చేశారు.

# నామినేషన్ కేంద్రాలలో ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, హెల్ప్‌డెస్క్ సిబ్బందికి స్పష్టమైన విధులు కేటాయించాలని, రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ లక్ష్మీపతి, మదనపల్లె తహసీల్దార్ మాధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## మదనపల్లి, రాయచోటి లలో పోలీసుల ర్యాలీ

**హైదరాబాద్ పెన్ పవర్:** అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎస్పీ ధీరజ్ కనుమిలి ఆధ్వర్యంలో మదనపల్లి రాయచోటి లలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ ధీరజ్ మాట్లాడుతూసమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మదనపల్లెలోని బీటీ కళాశాల పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసులతో పాటు, జిల్లాలో వివిధ కారణాలతో మృతి చెందిన తొమ్మిది మంది పోలీసులను స్మరించుకున్నారు.త్యాగాలకు ప్రతీక.. అక్టోబర్ 21ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లో చైనా సైనికుల దాడిలో పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందిన ఘటనకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ రక్షణతో పాటు ప్రజల భద్రత కోసం నిరంతరం సవాళ్లను ఎదుర్కొంటూ, నిస్వార్థంగా సేవలందిస్తున్న పోలీసుల త్యాగాలు సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు.ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు, సమాజంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అన్నమయ్య జిల్లా పోలీసులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ధైర్యం, అంకితభావం పోలీసుల విధి నిర్వహణకు బలంలిజిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.. "ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు.. భయం ఉన్నప్పటికీ బాధ్యతతో ముందడుగు వేయడం" అని పేర్కొన్నారు. దేశ రక్షణలో, ప్రజల భద్రతలో అమరులైన పోలీసుల ధైర్యసాహసాలు, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఉగ్రవాదులు, నక్సలైట్లు, నేరస్థులతో పోరాడుతూ అనేకమంది పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు.కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహించారని తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలు చేసిన త్యాగాలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి ఏ అవసరం వచ్చినా సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు.అమరులకు ఘన నివాళులు.. పోలీసు అమరవీరుల స్మారక ర్యాలీ.కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన 154 మంది పోలీసుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసు పరేడ్ మైదానం నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు స్మారక ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ ర్యాలీలో సాయుధ పోలీసు బలగాలు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల భద్రత పట్ల వారి అంకితభావాన్ని చాటిచెప్పారు.అమరుల కుటుంబాలకు అండగా పోలీసు శాఖకార్యక్రమం ముగింపులో జిల్లాలో మృతి చెందిన పోలీసుల కుటుంబ సభ్యులకు అధికారులు నగదు బహుమతులు అందజేశారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అమరుల కుటుంబాల సంక్షేమానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు యు. రంగనాథ్ బాబు, కె. సురేష్ కుమార్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరుల కుటుంబ సభ్యులు తదిత

# విధినిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**చందుర్తి మండలం లింగంపేట అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించి, నివాళులర్పించిన జిల్లా ఎస్పీ**

**పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ, వారి కుటుంబ సభ్యులను ఎస్పీ మహేష్ బి.గితే పరామర్శ**

**రాజన్న సిరిసిల్ల పెన్ పవర్:** శాంతి భద్రతల పరిరక్షణకై విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ మహేష్ బి గితె పేర్కొన్నారు.జిల్లాలోని చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో ఉన్న పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే) నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం సాయుధ పోలీసులు"శోక్ శస్త్" నిర్వహించి, మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 154 మంది పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు.

ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.....శాంతి భద్రతల పరిరక్షణకై సవాళ్లను ధీటుగా ఎదురించి, ప్రాణాలను సైతం త్యాగం చేసి, విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 08 మందికి పైగా పోలీసులు అసువులు బాసారని, వారి త్యాగఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని, పోలీసుల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, విధి నిర్వహణలో భాగంగా ఎన్నో జఠిలమైన సవాళ్లు ఎదురవుతున్నా అమరవీరులు అందించిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామని అన్నారు. దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతంలో పహారా కాస్తున్న సిఆర్పిఎఫ్ పోలీసులను 1959లో ఇదే రోజున చైనా దేశానికి చెందిన సైనికులు హతమార్చారని, అప్పటినుండి వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, వారి యొక్క సమస్యలను ఎస్పీ ఆరా తీశారు.వారు విన్నవించిన సమస్యలను సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందజేశారు. పోలీస్ అమరవీరులను స్మరిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు నుండి 31 తేదీ వరకు రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీ, క్యాండిల్ ర్యాలీ, రన్, ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫోటో, వీడియో పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సిఐ లు, ఆర్ఐ లు,ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొనరావుపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**హైదరాబాద్ పెన్ పవర్:**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా బుధవారం రోజున కొనరావుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని,విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు.పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు.ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ



మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.ఎస్పీ వెంట సిఐ రవికుమార్, ఎస్.ఐ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

# పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

**సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్**

**మెదక్: పెన్ పవర్:** శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని లికలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం అక్టోబర్ 21 పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెదక్ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, తో కలిసి లికలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు.

ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులర్పించారు.

**రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.**



తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా... విధులను నిర్వహిస్తూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు.విరామం లేకుండా అనునిత్యం పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా జిల్లా లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో అలాగే.... అకాల వర్షం వచ్చినప్పుడు... ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు తదితర సందర్భలల్లోప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులు భాగస్వామ్యం అవుతున్నారన్నారు ప్రతి రోజు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ముందుకు వెళ్లే పోలీస్ అధికారులు స్ఫూర్తిదయాకమన్నారు పోలీస్ అమరుల త్యాగాలను వృధా కానివ్వకుండా, వారి స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయం గా విధుల్లో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా లో శాంతిభద్రతలు నెలకొని ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు

ప్రస్తుత సమాజంలో మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ... అతి తక్కువ వ్యవధిలో ఎంతో చాకచక్యంగా సైబర్ నేరాలను ఛేదిస్తూ, నేరస్థులను పట్టుకుంటున్నారన్నారు

అమరవీరుల కుటుంబాలకు గిఫ్ట్ ప్యాక్ లు కలెక్టర్ ,ఎస్పీఅందించారు

వ్యాచారచన పోటీలలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారుఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ

డీవి శ్రీనివాసరావు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,సిఐలు, ఎస్హెచ్ఓ, తదితరులు పాల్గొన్నారు

# ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు..

**నిజామాబాద్ అక్టోబర్ 21 పెన్ పవర్:**

ఎంతో ఘన చరిత్ర కలిగిన ఇందూరు ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చత్రపతి శివాజీ గురువు సమర్థ రామదాసు నిర్మించిన చారిత్రాత్మక కట్టడం ఖిల్లా రామాలయం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి కృష్ణమాచార్యులు జైలు శిక్షణ అనుభవిస్తూ "తెలంగాణ నాకోటి రతనాల వీణ " అని రాసిన గొప్ప చరిత్ర కలిగిన ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు కావడం సంతోషకరమన్నారు. పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సుమారు రూ.35 కోట్ల నిధులతో రోప్ వే నిర్మాణం కానుందని, ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రామాలయ అభివృద్ధిని మరిచారన్నారు. మోదీ ప్రభుత్వం చారిత్రక కట్టడాలపై ప్రత్యేక దృష్టి వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే పర్వతమాల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధి కొరకు గతంలో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో రోప్ వే మంజూరైనట్లు స్పష్టం చేశారు.

కేంద్రమంత్రి నితిన్ ఘట్కరితోపాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఖిల్లా రామాలయ అభివృద్ధి పై అనేక సార్లు లేఖలు అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రోడ్లు భవనాల శాఖ అధికారులను, రోప్ వే కంపెనీ ప్రతినిధులను పంపడం సంతోషకరమన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులపై కూడా అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా రాని నియోజకవర్గం ఇందూరు ఒకటేనని చెప్పారు. సమస్యను మంత్రి పొంగిలేటి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో ఇటీవల అర్బన్ లోని సౌత్ మండల అర్హులకు ఇళ్లను కేటాయించాలని గుర్తు చేశారు. అలాగే స్థలం లేని వారికి హైదరాబాద్ మాదిరిగా టవర్లు నిర్మించి ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు.

ప్రధానంగా స్పెషల్ ఫండ్ కోసం ప్రభుత్వానికి అనేకసార్లు లీగల్ రాసిన స్పందించడం లేదన్నారు. చివరికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. స్పెషల్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధి సులువుగా అవుతుందని తెలిపారు. ఇందూరులో కాషాయ జెండా గెలుపును ఓర్చుకోలేక నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. అవసరపు మాటలు మాట్లాడటమే తప్ప అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, మఠం పవన్, రాము, విజయ మల్లేష్ యాదవ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చ అధ్యక్షుడు వంశీ, యువ మోర్చ రాష్ట్ర సహ కోశాధికారి విజయ్, ఎస్సీ మోర్చ పురుషోత్తం, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాస్ లుక్ ట్రై చేస్తున్నకేటీఆర్




**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయం అంటే కేవలం సిద్ధాంతాలు, సుదీర్ఘమైన సభా ప్రసంగాలు, ఆకర్షణీయమైన మేనిఫెస్టోలకే పరిమితం కాదనేది ఆధునిక విజువల్ మీడియా యుగంలో స్పష్టమవుతున్న సత్యం. ప్రజాస్వామ్యంలో నాయకుడి ప్రవర్తనతో పాటు ఆయన విజువల్ అప్పీరెన్స్ కూడా ప్రజల మనస్తత్వాన్ని, అభిప్రాయాలను ప్రభావితం చేసే ప్రధాన అంశంగా మారిపోయింది. గతంలో విదేశీ విశ్వవిద్యాలయాల డిగ్రీలు, కార్పొరేట్ నేపథ్యం, ఎల్లప్పుడూ క్లీన్ షేవ్‌తో సాఫ్ట్‌గా, విదేశీ రీతిలో కనిపించిన నేతలను విపక్షాలు పప్పు అంటూ మాస్ ప్రజలకు దూరం చేసేలా ప్రచారం చేసిన దాఖలాలను తెలుగు రాజకీయాల్లో చూశాం. అదే ముద్ర పడిన నారా లోకేష్.. తన పాదయాత్ర నాటికి బాడీ లాంగ్వేజ్, మాటతీరు, కట్టుబొట్టు మార్చుకుని తన ఇమేజ్‌ను పూర్తిగా రీబ్రాండ్ చేసుకుని విజయం సాధించారు. ఇప్పుడు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కూడా అదే తరహా మేక్ ఓవర్ మార్గంలో అడుగులు వేస్తున్నారు. ఇప్పటివరకు ఐటీ మంత్రిగా, అర్బన్ డెవలప్‌మెంట్ ఫేస్‌గా విదేశీ పెట్టుబడులు, కార్పొరేట్ సదస్సులు, సూట్ అండ్ టై లేదా ట్రెండీ క్లాస్ దుస్తుల్లో కనిపించిన కేటీఆర్.. ఇటీవల ఒత్తైన గడ్డం, మాస్ లుక్‌తో ప్రజల ముందుకు రావడం సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రామగుండం సింగరేణి కార్మిక గర్జన సభ నుంచి సచివాలయ సమీక్షల వరకు ఆయన కొత్త గడ్డం లుక్ వైరల్ కాగా.. రాబోయే తెలంగాణ వ్యాప్త పాదయాత్రకు సిద్ధమయ్యే క్రమంలోనే కేటీఆర్ ఈ మాస్ మేక్ ఓవర్ ఎంచుకున్నారని భావిస్తున్నారు. తనకున్న అర్బన్, క్లాస్ ఇమేజ్ ను తొలగించుకుని, క్షేత్రస్థాయి గ్రామీణ, కార్మిక, మాస్ ప్రజలకు మరింత దగ్గర కావాలనే వ్యూహం ఈ రూపమార్పు వెనుక ఉందనేది స్పష్టమవుతోంది.అయితే, ఇక్కడ కీలకమైన ప్రశ్న ఏమిటంటే.. కేవలం గెటప్ మార్చినంత మాత్రాన లేదా గడ్డం పెంచినంత మాత్రాన రాజకీయాల్లో ఓట్ల వర్షం కురుస్తుందా? ప్రజలు ఒక నాయకుడిని కేవలం ఆయన బాహ్య రూపాన్ని చూసి గెలిపిస్తారా? అనే కోణంలో లోతైన విశ్లేషణ అవసరం. గెటప్ చేంజ్ అనేది కేవలం ప్రజల దృష్టిని ఆకర్షించడానికి, ప్రాథమిక క్యూరియాసిటీని పెంచడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. అసలైన మార్పు అనేది నాయకుడి భావజాలం, ప్రజా సమస్యలపై పోరాడే తీరు, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యే విధానంలో స్పష్టంగా కనిపించినప్పుడే ఆ విజువల్ చేంజ్ కు రాజకీయ అర్థం ఏర్పడుతుంది. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు ఇటీవలి రాహుల్ గాంధీ, నారా లోకేష్‌లను గమనిస్తే.. వారు వేల కిలోమీటర్లు ఎండనకా, వాననకా ప్రజల మధ్య నడిచారు. పాదయాత్రల్లో ప్రజల కష్టాలను నేరుగా విని, వారి ఆవేదనను ప్రతిబింబించారు. ఆ నిరంతర శ్రమ, క్షేత్రస్థాయి పట్టుకు అనుబంధంగా వారి గెటప్ ఒక శక్తివంతమైన సింబాలిజమ్‌గా పనిచేసింది. కేటీఆర్ విషయంలో కూడా ఆయన పెంచిన గడ్డం లేదా మాస్ లుక్ అనేది పాదయాత్రలో ప్రజలను కలిసేటప్పుడు ఒక సీరియస్ పోరాట ప్రతిమను ఇస్తుందే తప్ప.. ప్రజాక్షేత్రంలో గడిపే సమయం, వినిపించే గొంతుక ఆధారంగానే ఓటర్ల తీర్పు ఆధారపడి ఉంటుంది.మరోవైపు, ప్రత్యర్థి కాంగ్రెస్, బీజేపీలు కేటీఆర్ కొత్త లుక్‌ను తీవ్రంగా ట్రోల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. సోషల్ మీడియాలో కూడా ఈ మేక్ ఓవర్‌పై మీమ్స్, రీల్స్ హల్‌చల్ చేస్తున్నాయి. రాజకీయాల్లో మేక్ ఓవర్ అనేది ప్రచార వ్యూహంలో భాగమే అయినప్పటికీ, అది విజయానికి ఒక సాధనం మాత్రమే తప్ప, విజయాన్ని ఖాయం చేసే ఏకైక కారకం కాదు. కేటీఆర్ తన 'క్లాస్' పరిమితులను దాటుకుని, క్షేత్రస్థాయి మాస్ నాయకుడిగా రూపాంతరం చెందడానికి ఈ గెటప్ మార్పు ఉపయోగపడవచ్చు. కానీ, ఓట్లు రాలాలన్నా, బీఆర్ఎస్ మళ్లీ పూర్వ వైభవం సాధించాలన్నా.. ఆ గెటప్ వెనుక ఉన్న నాయకుడు తెలంగాణ క్షేత్రస్థాయి ప్రజా సమస్యలపై ఎంత కసిగా, ఎంత నిలకడగా పోరాడతారనే అంశమే అంతిమ తీర్పును నిర్ణయిస్తుంది.

# మెట్రోకు 60 కొత్త కోచ్‌లు



**హైదరాబాద్,అక్టోబరు 21 పెన్ పవర్:**
హైదరాబాద్ మెట్రోలో నిత్యం ప్రయాణించే నగరవాసులకు ఎట్టకేలకు ఊరటనిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. మెట్రో నెట్‌వర్క్‌లో తీవ్రమవుతున్న రద్దీని నియంత్రించేందుకు 60 కొత్త స్టాండర్డ్ గేజ్ కోచ్‌లను సమకూర్చుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ , దాదాపు రూ. 923.62 కోట్ల అంచనా వ్యయంతో డిజైన్, సరఫరా, టెస్టింగ్, కమిషనింగ్‌తో పాటు 15 ఏళ్ల నిర్వహణ కోసం అంతర్జాతీయ బిడ్లను ఆహ్వానిస్తూ అధికారికంగా టెండర్లను జారీ చేసింది.గత మూడేళ్లకు పైగా హైదరాబాద్ మెట్రో తన సామర్థ్యానికి మించి నడుస్తూ ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పీక్ అవర్లలో ఐటీ కారిడార్‌తో పాటు మియాపూర్-ఎల్‌బీనగర్, నాగోల్-రాయదుర్గం మార్గాల్లో ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మూడు కోచ్‌ల రైళ్లు పెరిగిన ప్రయాణికుల రద్దీని ఏమాత్రం తట్టుకోలేకపోతుండటంతో అదనపు కోచ్‌ల పెంపు చాలా కాలంగా అవసరమైన అంశంగా మారింది.తాజా టెండర్ ప్రక్రియ ప్రకారం.. బిడ్ల దాఖలుకు గడువు ముగిసిన తర్వాత సాంకేతిక, ఆర్థిక మూల్యాంకనం ఆధారంగా కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయనున్నారు. కొత్త కోచ్‌ల రూపకల్పన, తయారీ, సరఫరా తదితర ప్రక్రియలు పూర్తి కావడానికి ఒప్పందం ప్రకారం నిర్దిష్ట గడువు ఉన్నప్పటికీ.. రాబోయే ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంలో ఈ కోచ్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఈ 60 కొత్త కోచ్‌లు అందుబాటులోకి వస్తే.. ప్రస్తుతం నడుస్తున్న రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచడానికి లేదా కొన్ని కీలక రూట్లలో రైళ్ల సామర్థ్యాన్ని విస్తరించడానికి మెట్రో యాజమాన్యానికి వెసులుబాటు లభిస్తుంది. తద్వారా ప్లాట్‌ఫారాలు, రైళ్లలోని రద్దీ తగ్గి, ప్రయాణికులకు సాఫీగా, సౌకర్యవంతంగా ప్రయాణించే అవకాశం దక్కుతుంది. మెట్రో విస్తరణ గాల్లో దీపంలా మారిన సమయంలో కనీసం కొత్త కోచ్‌లను అయినా సమకూరిస్తే ప్రజలకు ఊరట లభిస్తుందని భావిస్తున్నారు

# పోలీసు అమరులు చేసిన త్యాగాలు మరువలేనివి

**హైదరాబాద్ పెన్ పవర్:**
పోలీసు అమరవీరుల సంస్మరణ దినమైన అక్టోబర్ 21 ఎంతో భావోద్వేగమైన రోజని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల భద్రత, సమాజ రక్షణ కోసం పోలీసు అమరులు చేసిన త్యాగాలు మరువలేనివని, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు, పోలీసుల సంక్షేమం, వారి పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అమరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంపుతో పాటు, అర్హులకు ప్రభుత్వ ఉద్యోగం, ఉచిత విద్య, వైద్య సహాయం అందిస్తున్నామని, పోలీసుల పిల్లల కోసం ప్రత్యేకంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించామని వివరించారు.
మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలి. బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదు. మహిళల భద్రత కేవలం పోలీసు శాఖ బాధ్యత కాదు.. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలి . పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని మీ కుటుంబ సభ్యుల్లాగా చూడండి. అలా అయితేనే మీరు బాధ్యతగా వ్యవహరిస్తారు. నూటికి నూరు శాతం సమస్యకు పరిష్కారం చూపిస్తారని అన్నారు.
సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, ఆహారం కల్తీ వంటి మారుతున్న నేర స్వభావాలు, సవాళ్లను ఎదుర్కోవడంలో పోలీసు శాఖను బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీసు అమరుల త్యాగాలను గౌరవిస్తూ, వారి ఆశయాలను కొనసాగిస్తూ శాంతియుతమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, శాంతి భద్రతల ప్రాధాన్యత, పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు.
అమరుల కుటుంబ సభ్యులకు ఒక మాట చెబుతున్నాను. మీరు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేరు. కానీ మీ బాధలో మీరు ఒంటరివారు కాదు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం మీకు అండగా ఉంటాయని అన్నారు.
ఈ ఏడాది అమరులైన పోలీసు కుటుంబాల సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

## దసరా వేడుకల్లో ఆత్మీయులతో స్పీకర్

## సొంత నియోజకవర్గంలో నిర్వహించిన దసరా వేడుకల్లో తెలంగాణ శాసన సభాపతి,

వికారాబాద్ జిల్లా: వికారాబాద్ శాసనసభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొనడంతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. అడుగడుగునా ఆత్మీయ స్వాగతాలు, అభిమాన పలకరింపులతో వికారాబాద్ పట్టణం పండుగ శోభను సంతరించుకుంది.ఆప్యాయతను పంచుకుంటూ, ఆత్మీయతను చాటుకుంటూ సాగిన ఈ వేడుకలు దసరా సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటి చెప్పాయి. దసరా సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ తన సొంత నియోజకవర్గంలోని ప్రజల మధ్య ఆత్మీయంగా గడుపుతూ, పెద్దలు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ, సరదాగా ముచ్చటిస్తూ పండుగ ఆనందాన్ని అందరితో పంచుకున్నారు.వికారాబాద్ ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లోనూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా అమరవీరుల దినోత్సవం

**వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ పట్టణ కేంద్రం లోని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహర పాల్గొని ముందుగా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ
దేశం కోసం, ప్రజల రక్షణ కోసంతమ ప్రాణాలను సైతం త్యాగం చేసినవీర పోలీస్ అమరవీరులకు హృదయపూర్వక నివాళులు అర్పించారు.వారి త్యాగం చిరస్మరణీయం అని కొనియాడారు.వారి సేవలు స్ఫూర్తిదాయకశీ అన్నారు.పోలీసులు విధినిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం 24 గంటలు తమ కుటుంబాలు సైతం లెక్క చేయకుండా పనిచేయడమే పోలీస్ యొక్క కర్తవ్యశీ అని తెలిపారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం:

## కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌష్ ఆలం

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల నామావళిని చదివి వినిపించి గౌరవ వందనం సమర్పించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ. దేశవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. జిల్లా యంత్రాంగానికి పోలీస్ శాఖ వెన్నెముక వంటిదని, శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు, వారి పిల్లల విద్యాభివృద్ధి, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ. దేశ సమగ్రత, అంతర్గత భద్రత, ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అంకితభావంతో సేవలందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని పేర్కొన్నారు.పోలీసు అమరవీరుల కుటుంబాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వం వారికి అందాల్సిన నష్టపరిహారాలను పూర్తి స్థాయిలో అందేలా చూస్తామన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31 వరకు కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, లఘు చిత్రాల పోటీలు, విద్యార్థులు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు.

## ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం:

## సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్

**సిద్దిపేట పెన్ పవర్:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే పురస్కరించుకొని సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణాస్తుల రక్షణకై విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్,అదనపు డీసీపీలు, ఇతర అధికారులు మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సిపి రష్మి పెరుమాళ్, మాట్లాడుతూ. పోలీస్ శాఖ అనేది ప్రతిరోజూ 24 గంటలూ పనిచేసే విభాగామని, పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా సిబ్బంది నిరంతరం ఆన్ డ్యూటీలో ఉంటూ ప్రజల రక్షణ కోసం శ్రమిస్తున్నారని కొనియాడారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా సైన్యం పొంచి దాడి చేసిన ఘటనలో వీరమరణం పొందిన పోలీస్ సిబ్బంది అత్యున్నత త్యాగాలను స్మరించుకుంటూ, నాటి నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 21ని 'పోలీస్ కొమెమరేషన్ డే' అమరవీరుల సంస్మరణ దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను, వారి త్యాగాలను డిపార్ట్‌మెంట్ ఎప్పటికీ మరచిపోదని స్పష్టం చేశారు. పోలీస్ కుటుంబాలకు ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా సంప్రదించవచ్చని, సిద్ధిపేట సిపిగా తాను మరియు పోలీస్ డిపార్ట్మెంట్ ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశమంతటా పోలీస్ ఉన్నతాధికారులు అమరవీరుల కుటుంబాలకు ఇదే ప్రామిస్ చేస్తున్నారని, ఇంతటి అత్యున్నత త్యాగం చేసినా వారి కుటుంబ సంక్షేమానికి పోలీస్ డిపార్ట్మెంట్ కట్టుబడి ఉంటుందని తెలిపారు.
కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబ సభ్యులతో సిపి ప్రత్యేకంగా మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులను మరియు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు విన్నవించిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇస్తూ, అమరవీరుల కుటుంబ సభ్యులను గౌరవించి జ్ఞాపికలను అందజేశారు.అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ మాట్లాడుతూ. సిద్ధిపేట కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 7 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 154 మంది అమరులైన పోలీస్ అధికారుల మరియు సిబ్బంది పేర్లను చదివి వినిపించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు మరియు పోలీస్ సిబ్బంది విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా లీగల్ స్టూడెంట్స్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షుడిగా రణదీప్ రెడ్డి నియామకం



**ఎల్బీనగర్, పెన్ పవర్ అక్టోబర్ 21:** విజయదశమి శుభ సందర్భంగా ఆల్ ఇండియా లీగల్ స్టూడెంట్స్ ఫోరం నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. ఇందులో న్యాయశాస్త్ర విద్యార్థి రణదీప్ రెడ్డిని జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా రణదీప్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, న్యాయశాస్త్ర విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వారి అందుబాటులో ఉంటూ, వారి హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## దసరా సందర్భంగా జగదీశ్వర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన యలమంచి ఉదయ్ కిరణ్



**హైదరాబాద్ పెన్ పవర్ అక్టోబర్ 21:** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ జగదీశ్వర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్‌కు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బేరి రాంచందర్ యాదవ్, గిరి, యాదన్న గౌడ్, ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి చంద్ర మౌళి, సతీష్, సాయి లోహిత్, శశి తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో కవిత పార్టీ



**హైదరాబాద్,అక్టోబరు 21 పెన్ పవర్:**
తెలంగాణ రక్షణ సేన ప్రత్యక్ష ఎన్నికల సమరానికి తొలిసారిగా శంఖారావం పూరించింది. ఉమ్మడి వరంగల్ -- ఖమ్మం -- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థిగా ఉద్యమకారుడు, విద్యావేత్త డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అధికారికంగా ప్రకటించారు. దసరా పర్వదినం శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని పార్టీ తరఫున ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్న మొట్టమొదటి అభ్యర్థిని ఖరారు చేస్తూ ఆమె నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో ఈ స్థానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, బలమైన విద్యా నేపథ్యం ఉన్న ఉద్యమ నేతను బరిలో నిలిపారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని, గ్రౌండ్ లెవల్ సమన్వయాన్ని వేగవంతం చేసేందుకు పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని కూడా రంగంలోకి దించారు. ఈ ఎన్నికల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు, సమన్వయం చేసేందుకు స్టేట్ పార్టీ అబ్జర్వర్, ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్‌ను కల్వకుంట్ల కవిత నియమించారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఆకాంక్షలను ప్రధాన ఎజెండాగా తీసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లేలా పక్కా కార్యాచరణను రూపొందించాలని ఇస్మాయిల్‌కు బాధ్యతలు అప్పగించారు.అభ్యర్థిగా ఎంపికైన డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ సుదీర్ఘమైన ఉద్యమ, విద్యా నేపథ్యం కలిగిన నాయకుడు. దసరా పండుగ శుభసందర్భంగా శ్రీకాంగ్ గౌడ్‌ను తమ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కవిత ప్రకటించారు. ఈ ఎమ్మెల్సీ స్థానంలో ఎన్నికల సమన్వయం, పర్యవేక్షణ కోసం స్టేట్ పార్టీ అబ్జర్వర్‌గా సయ్యద్ ఇస్మాయిల్‌ను నియమించినట్లు కవిత తెలిపారు. ఈ ప్రకటనతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కవిత పార్టీ పోటీకి సిద్ధమైనట్లు స్పష్టం చేసింది. అభ్యర్థి ప్రకటనతో పట్టభద్రుల ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని పార్టీ నిర్ణయించింది.ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లికి చెందిన ఆయన కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పూర్తి చేశారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థి దశ నుంచే చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ జాగృతి సంస్థ ప్రారంభమైన నాటి నుంచి కల్వకుంట్ల కవిత వెన్నంటి నడిచిన ఆయన.. పార్టీ అధికార ప్రతినిధిగా టీవీ చర్చల్లో, ప్రజా సంఘాల వేదికలపై సమర్థవంతంగా గళం వినిపిస్తూ ప్రజల్లో విశేష గుర్తింపు పొందారు.బహుజనుల గొంతుకగా నిలుస్తూ నిరంతరం ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేస్తున్న కల్వకుంట్ల కవిత.. అదే సంప్రదాయాన్ని తొలి ఎన్నికల అభ్యర్థి ఎంపికలోనూ కొనసాగించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉన్నత విద్యావంతుడికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పార్టీ విధానాలను చేతల్లో చాటిచెప్పారు. తెలంగాణ రక్షణ సేన నేరుగా ఎన్నికల క్షేత్రంలోకి దిగడం, అందునా విద్యావంతులు, నిరుద్యోగులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్న పట్టభద్రుల స్థానాన్ని ఎంచుకోవడంతో వరంగల్ -- ఖమ్మం -- నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోరు ఆసక్తికరంగా మారిం

# యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 21:**
కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువజన కాంగ్రెస్ నాయకులు కీలక పాత్ర పోషించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సూచించారు. యువతలో రాజకీయ చైతన్యం పెంపొందిస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన గుర్రం రాకేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బానోత్ సాయి తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. యువజన కాంగ్రెస్‌లో కొత్త బాధ్యతలు చేపట్టడం యువ నాయకులకు మంచి అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని దయాకర్ రెడ్డి ఆకాంక్షించారు. యువతను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ, విద్యార్థులు, నిరుద్యోగులు, యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో యువ నాయకులు ముందుండాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రం రాకేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బానోత్ సాయి మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశయాలకు అనుగుణంగా, పార్టీ నాయకుల సహకారంతో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. యువతను ఏకతాటిపైకి తీసుకొచ్చి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు అజ్మీరా అశోక్ నాయక్, ఏదులాపురం మున్సిపాలిటీ బీసీ సెల్ అధ్యక్షుడు వెంపటి రవి, 30వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు కొట్టం రంజిత్ రెడ్డి, యర్ర శేఖర్ రెడ్డి, గంగారపు యాదగిరి, యువజన నాయకులు బోయిన సాయి, ఏపూరి తరుణ్, భద్రాచారి, శివ, వడ్లకొండ భుజంగరావు, సాయి కార్తీక్, ఏపూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ తగ్గిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు! సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గుదల




**హైదరాబాద్,అక్టోబరు 21 పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ జోరుకు సెప్టెంబర్ నెలలో కాస్త బ్రేకులు పడ్డాయి. గృహాలకు సంబంధించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్యలో గత ఏడాదితో పోలిస్తే గణనీయమైన తగ్గుదల నమోదైంది. అయితే, కోటి రూపాయలకు పైబడిన ప్రీమియం ఇళ్ల సెగ్మెంట్ మాత్రం స్థిరమైన డిమాండ్‌తో మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది.ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ల శాఖ డేటాను విశ్లేషించి ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 సెప్టెంబర్‌లో హైదరాబాద్ (హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు కలిపి) పరిధిలో 5,620 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది ఇదే నెలలో నమోదైన 6,612 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఇది 15 శాతం తక్కువ. అదేవిధంగా, లావాదేవీల విలువ కూడా 7 శాతం తగ్గి, రూ.4,804 కోట్ల నుంచి రూ.4,487 కోట్లకు చేరింది. ఆగస్టు 2026 నెలతో పోల్చినా కూడా రిజిస్ట్రేషన్లలో 5 శాతం క్షీణత కనిపించింది.ఈ తగ్గుదల ప్రధానంగా బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల విభాగంలో ఎక్కువగా కనిపించింది. ?50 లక్షల లోపు విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఏకంగా 20 శాతం పడిపోగా, రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 6 శాతం తగ్గాయి.అయితే, దీనికి పూర్తి భిన్నంగా ప్రీమియం సెగ్మెంట్ నిలకడగా రాణించింది. కోటి రూపాయలకు పైబడిన విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు 12 శాతం తగ్గినా, వాటి లావాదేవీల విలువలో క్షీణత కేవలం 2 శాతంగానే ఉండటం గమనార్హం. మొత్తం లావాదేవీల విలువలో ఈ సెగ్మెంట్ వాటా గతేడాది 54 శాతం ఉండగా, ఈసారి అది 56 శాతానికి పెరిగింది. ఇది మార్కెట్‌లో అధిక విలువ గల గృహాలకు డిమాండ్ బలంగా ఉందని సూచిస్తోంది.సెప్టెంబర్ నెలలో అమ్మకాలు మందగించినప్పటికీ, 2026 క్యాలెండర్ సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల (జనవరి-సెప్టెంబర్) గణాంకాలను పరిశీలిస్తే మార్కెట్ నిలకడగానే ఉంది. ఈ తొమ్మిది నెలల్లో మొత్తం 55,715 యూనిట్లు రిజిస్టర్ కాగా, లావాదేవీల విలువ గతేడాది కంటే 4 శాతం పెరిగి రూ.39,910 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం గైడెన్స్ విలువల సవరణ తర్వాత నెలవారీ రిజిస్ట్రేషన్లలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రతినిధి శిశిర్ బైజాల్ మాట్లాడుతూ, "మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్యలో తగ్గుదల ఉన్నప్పటికీ, అధిక ధర కలిగిన ఇళ్ల అమ్మకాల వాటా పెరగడం వల్ల మొత్తం లావాదేవీల విలువ స్థిరంగా ఉంది. ఇది ప్రీమియం గృహాలకు కొనుగోలుదారుల నుంచి డిమాండ్ కొనసాగుతోందని స్పష్టం చేస్తోంది" అని వివరించారు. రిజిస్టర్ అయిన ప్రాపర్టీలలో 66 శాతం వాటాతో 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల మధ్య ఉన్న ఇళ్లే అధికంగా ఉన్నాయి.

# రాజకీయ పార్టీలకు జెన్ జీ భయం

**హైదరాబాద్,అక్టోబరు 21 పెన్ పవర్:**
తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెన్-జీ భయం రాజకీయా పార్టీలకు పట్టుకుంది. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు జెన్ జీ లు ఎవరికి మద్దతుగా నిలుస్తారన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జెన్ జీ ఉద్యమం ఎవరిని ముంచుతుందన్న ఆందోళనలోరాజకీయ పార్టీలున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలంటే కొత్తగా చేరిన యువత ఓట్లు ఎక్కువగా ఉంటాయి. దేశంలో ఇటీవల జెన్ జీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో మూడు ప్రధాన పార్టీలు భయాందోళనలో పడ్డాయి. యువత ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది ఈ ఎన్నికల్లో తేలిపోతుందన్నది ఆసక్తికరంగా మారింది. అనేక అంశాలు గెలుపోటములపై ప్రభావం చూపుతాయి. అందుకే రాజకీయ పార్టీలకు జెన్ జీ భయం పట్టుకుంది.. నిరుద్యోగ సమస్యలు ప్రధాన ప్రభావం చూపుతుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దాదాపు మూడు లక్షలకు పైగా కొత్త ఓటర్లు చేరే అవకాశం ఉండటంతో, వీరి మద్దతు ఎటు వైపు ఉంటుందనేది పార్టీల్లో ఉత్కంఠను రేపుతోంది. కొన్ని సర్వేల ప్రకారం... గ్రాడ్యుయేట్ ఓటర్లలో 31 శాతం మంది నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా పేర్కొన్నారు. జాబ్ నోటిఫికేషన్లు, ఉద్యోగాల భర్తీలో జాప్యం 24 శాతం వంటి అంశాలు కలిపి మొత్తం యాభై ఐదు శాతం వరకు ఉపాధి అంశాల చుట్టూనే చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పాలనపై ప్రజల, ముఖ్యంగా యువత అభిప్రాయానికి ఈ ఫలితాలను కొలమానంగా భావిస్తున్నారు. మూడు పార్టీల అభ్యర్థులు... కాంగ్రెస్ వేగంగా అభ్యర్థుల ఎంపిక మరియు ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టగా, బీజేపీ మరియు బీఆర్ఎస్ పార్టీలు కూడా ప్రత్యేక వ్యూహాలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. యువతలో ఉన్న అసంతృప్తిని ఎలా అధిగమించాలనేదానిపై పార్టీలు మథనపడుతున్నాయి. మరొకవైపు బీజేపీకి కూడా జెన్ జీ భయం పట్టుకుంది. దేశ వ్యాప్తంగా ఎన్నికల కమిషన్ వివిధ అంశాలపై ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో బీజేపీకి యువత హ్యాండ్ ఇస్తారన్న భయంలో బీజేపీ ఉంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు బీజేపీకి భయాన్ని కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ కూడా ఇదే పరిస్థితుల్లో ఉంది. బీఆర్ఎస్ యువతను ఆకట్టుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. గత పదేళ్ల పాలన ప్రభావం ఈ ఎన్నికల్లో చూపుతుందేమోనని కొంత బెరుకు కనపడుతుంది. మొత్తం మీద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెన్ జీ భయం అన్ని రాజకీయ పార్టీలకు వణుకు పుట్టిస్తోంది.

**రేవంత్ సర్కార్‌కు అసలు సిసలు అగ్నిపరీక్ష!**

. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనపై ప్రజలు, ముఖ్యంగా విద్యావంతులైన పట్టభద్రుల నాడి ఎలా ఉందో అంచనా వేయడానికి ఈ ఎన్నికలు ఒక లిట్మస్ టెస్ట్ లా మారాయి. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాలలో దాదాపు మూడింట రెండొంతులు అంటే 77 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేసే ఈ రెండు పట్టభద్రుల నియోజకవర్గాల పోరు రసవత్తరంగా మారుతోంది.కార్మికులు, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో విజయం సాధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన పాలనకు ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉందని నిరూపించుకోవాలనుకుంటోంది. ఒకవేళ ఫలితాలు వ్యతిరేకంగా వస్తే, అది కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతుంది. అంతేకాకుండా బీఆర్ఎస్, బీజేపీలు దీనిని ప్రభుత్వ వ్యతిరేకతగా ప్రచారం చేసే అవకాశం ఉంది. అందుకే కాంగ్రెస్ నాయకత్వం దీన్ని కేవలం సాధారణ ఎన్నికగా చూడకుండా.. రాజకీయ మనుగడకు, పట్టు నిలుపుకోవడానికి అత్యంత కీలకమైన పోరుగా భావిస్తోంది.ఈ ఎన్నికల్లో ముందుగా అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ఒక అడుగు ముందుకేసింది. మహబూబ్ నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానం నుంచి సామ రామమోహన్ రెడ్డిని, వరంగల్- నల్గొండ- ఖమ్మం స్థానం నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని బరిలోకి దింపింది. సీఎం రేవంత్ రెడ్డికి స్వస్థలమైన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఈ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయన దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ రెండు స్థానాల్లో గెలుపు కాంగ్రెస్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.మరోవైపు.. ఈ ఎన్నికలు కేవలం అభ్యర్థుల సామర్థ్యంపైనా ఆధారపడవు. ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంస్థాగత బలానికి కూడా పెద్ద పరీక్షగా మారాయి. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ధన ప్రభావం గణనీయంగా ఉండేది. అధికార పార్టీ ఈసారి ప్రచారంలో ఏ చిన్న అవకాశాన్ని కూడా వదిలిపెట్టాలని భావించడం లేదు. ఓటర్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయడానికి ఆన్‌లైన్ సదుపాయాలతో పాటు, నేరుగా ఓటర్లను సంప్రదించే వ్యూహాలకు పదును పెట్టారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దామోదర రాజనర్సింహ తదితరులు వివిధ జిల్లాల్లో పార్టీ శ్రేణులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ సమన్వయం చేస్తున్నారు. అక్టోబర్ 23న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించి తుది ప్రచార వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు.ఇదిలా ఉంటే... బీఆర్ఎస్ కూడా ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంబంధిత జిల్లాల నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్న జోష్‌లో ఉన్న బీజేపీ కూడా తన పట్టును మరింత నిలుపుకోవాలని చూస్తోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సౌలభ్యం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఓటర్ల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో లేకపోవడం అన్ని ప్రధాన పార్టీలకు సవాలుగా మారింది. మొత్తానికి.. ఉత్కంఠ రేకెత్తిస్తున్న ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణలో ఎవరికి పట్టం కడతాయనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# 'తిరుపతి' మేయర్ పీఠం అంత ఈజీకాదా ..!




**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల శ్రీవారు కొలువైన తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలు హాట్ హాట్‌గా సాగనున్నాయా? ఓటు బ్యాంకు వ్యవహారం ఇక్కడ కీలకంగా మారనుందా? అంటే.. తాజాగా మారుతున్న పరిణామాలను గమనిస్తే.. ఔననే సమాధా నమే వినిపిస్తోంది. దీనికి కారణం.. సీమ ప్రాంతంలోని కార్పొరేషన్లలో ఎక్కడా లేని విధంగా తిరుపతి కార్పొరేషన్‌లో నే పోటీ తీవ్రంగా ఉంది. మొత్తం 12 మంది మేయర్ పీఠం కోసం పోటీలో ఉన్నారు. వీరిలోనూ ప్రధానంగా వైసీపీ అభ్యర్థి నామినేషన్ సక్సెస్ అయింది.దీంతో కూటమి పార్టీల తరపున పోటీలో ఉన్న అభ్యర్థి గెలుపు ఇప్పుడు నల్లేరుపై నడక అయితే కాదన్న అభిప్రా యం వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఇతర ప్రాంతాల్లో చాలా వరకు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అధికారులు పలు కారణాలతో తిరస్కరించారు. కానీ, తిరుపతి విషయానికి వస్తే.. వాసుదేవ్ యాదవ్ నామినేషన్ ను అనుమతించారు. చిన్నపాటి వివాదాలు తలెత్తినా.. అధికారులు సర్దుకుపోయారు. ఇక, ఈ సీటును కూటమి పార్టీల్లో టీడీపీకి కేటాయిం చారు. ఈ పార్టీ తరపున మన్నెం శ్రీనివాస ప్రసాద్ బరిలోకి దిగారు. ఈయన కాకుండా.. కమ్యూనిస్టులు బలపరిచిన అభ్యర్థి సహా.. స్వతంత్ర అభ్యర్థులు.. మొత్తంగా 12 మంది మేయర్ కోసం పోటీపడుతున్నారు. ఇక, నామినేషన్లు అన్నీ అధికారుల ఆమోదం పొందిన నేపథ్యంలో ఉపసంహరణ వ్యవ హారం పెద్దగా కలిసి వచ్చేలా కనిపించడం లేదు. దీంతో కీలకమైన స్థానంలో పోటీ ఖాయమని తెలుస్తోంది. కూటమి పార్టీల ఐక్యతతో పాటు తిరుపతి ఎంపీ, వైసీపీ నాయకుడు గురుమూర్తి సహా భూమన కరుణాకర్ రెడ్డి వంటి సీనియ ర్లకు కూడా ఈ ఎన్నిక బిగ్ టెస్టుగానే మారనుంది.

**స్థానికంపై పట్టు..**

భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబానికి తిరుపతి స్థానిక ఎన్నికల వ్యవహారంపై మంచి పట్టుంది. గతంలో విజయం దక్కించుకున్న అనుభవంతోపాటు.. సానుభూతి కూడా ఉన్న నేపథ్యంలో ఆయన ప్రచారం.. వైసీపీ అభ్యర్థికి కలిసి రానుందన్న అంచనాలు ఉన్నాయి. ఇక, కూటమిలో సఖ్యత ఇక్కడ కీలకంగా మారనుంది. అదేసమయంలో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో ఇటీవల తలెత్తిన కొన్ని వివాదాలు కూడా ఇక్కడ ఎన్నికల్లో ప్రచార అస్త్రాలుగా మారనున్నాయి. దీనికితోడు.. ఇండిపెండెంటు అభ్యర్థులు ఏమేరకు ఓటు బ్యాంకును ప్రభావితం చేస్తారన్న విషయంపై కూడా ఎన్నికల్లో విజయం ఆధారపడి ఉంటుందన్న చర్చ సాగుతోంది. ఏదేమైనా తిరుపతి స్థానం ఇప్పుడు వైసీపీ, టీడీపీలకు ప్రతిష్టాత్మకంగా మారిందనే చెప్పాలి.

# జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా

**పులివెందుల,అక్టోబరు 21 పెన్ పవర్:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే టీడీపీ, వైసీపీలు రెండూ ఒకే బాట పయనిస్తున్నాయి. అరాచకాలలో ఒకరిని మించి మరొకరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ పాలనపై విమర్శలు చేసే చంద్రబాబు నేడు జరుగుతున్న పరిస్థితులను అవతలి వారిపైకి నెట్టడం సమర్థనీయం కాదు. ఎన్నికలంటే శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదు. ఇప్పుడు జరుగుతున్న, జరిగిన పరిణామాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా చేష్టలుడిగి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంత ఉదాసీన వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఇవే పరిస్థితులు తలెత్తక మానవన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు కూడా చేస్తున్నారు.రాజకీయాలు చూడండి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం అధికార పార్టీది, విపక్ష పార్టీది ఒకే దారి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు వైసీపీ బాధిత పార్టీగా కనిపించవచ్చు. కానీ అదే తమ పాలనలో జగన్ ప్రభుత్వం అవలంబించిన చర్యలేవిటి? అని చంద్రబాబు ప్రశ్న కూడా అందరూ ఆలోచించాల్సిన విషయమే. అలాగే ఇదే విమర్శ రేపు చంద్రబాబు కూడా ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చు. నాడు కుప్పం నియోజకవర్గంలో జగన్ చేసిన పని, నేడు పులివెందులలో టీడీపీ చేసింది. ఇందులో తప్పు వెతుక్కోవడానికి ఇద్దరిలోనూ వెతికినా కనిపించవు. కానీ జనం మాత్రం వీటిని గమనిస్తూనే ఉంటారన్న విషయాన్ని మాత్రం వైసీపీ, టీడీపీలు మర్చి పోకూడదు. ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించాలంటే రెండు పార్టీల అధినేతలు ఎవరికి వారే ఆత్మవిమర్శలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ, వైసీపీ లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించుకోవాలని సహజంగానే భావిస్తుంది. అదే సమయంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత బలోపేతం అయితే రానున్న సాధారణ ఎన్నికలకు పుంజుకుంటామని భావన కారణంగానే ఈ రకమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నది కాదనలేని వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అందులో తప్పులేదు. కానీ హింసా రాజకీయాలకు స్వస్తి పలకాలి. అనుభవమున్నచంద్రబాబు కు ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. ఒకరకంగా జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా? అన్న అనుమానం కూడా చాలా మంది సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ నామినేషన్ల సందర్భంగానే చూశాం. ఇక జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఇంకెంత రగడ చూడాలో.. .దేవుడా



ఏపీకి నీవే దిక్కు. అని అనుకోవడం తప్ప చేసేదేమీ లేదు

**వ్యూహాలు ప్రతివ్యూహాలతో**

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాచికలు పారినట్లు కనపడుతుందివైఎస్ మోహన్ రెడ్డి వ్యూహాలు ప్రతివ్యూహాలతో సర్వసన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంది. దీంతో తాడిపత్రి మున్సిపాలిటీ తప్పించి అన్నింటా వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు టీడీపీ పాలనపై వ్యతిరేకత తెచ్చేందుకు, తమ పార్టీపై సానుభూతి కురిసేందుకు జగన్ వేసిన వ్యూహం సక్సెస్ అయినట్లే కనపడుతుంది. ప్రతి చోట ఖచ్చితంగా నామినేషన్లు వేయాలని, ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వనని జగన్ నాడు చేసిన హెచ్చరికలను వేరే విధంగా చూసిన వారికి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతుంది. జగన్ తన ఎత్తుగడలో భాగంగనే నామినేషన్లు వేయించి అభ్యర్థులను బరిలోకి దిగితే శాంతిభద్రతలు అదుపు తప్పి టీడీపీ పాలనపై వ్యతిరేకత ఏర్పడుతుందని అంచనా నిజమవుతుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల పర్వం చూస్తేనే ఇది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.మ్యాప్‌లు చూడండి ప్రతి సీటులోనూ పోటీకి... గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా, ఈసారి ప్రతి స్థానంలోనూ వైసీపీ అభ్యర్థిని పోటీకి నిలపాలని జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అధికార కూటమికి ఏకగ్రీవాలు చేసుకునే అవకాశం ఇవ్వకూడదని, ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో ఏకగ్రీవమైతే దానికి స్థానిక నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు పూర్తయి ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో అధికారికంగా ప్రకటించినప్పటికీ... వైఎస్ జగన్ మాత్రం ఒక అడుగు ముందే వేసి మొదటి విడతగా 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. గ్రౌండ్ రిపోర్టుల ఆధారంగా ప్రజాదరణ కలిగిన బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ కొత్త ఎత్తుగడలతో ముందుకు వెళు తున్నారు.ఎన్నికల సమాచారం చూడండి.. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం లేదా పోలీస్ వ్యవస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను, అక్రమాలను తట్టుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక లీగల్ సెల్స్, మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా అధికార దుర్వినియోగ ఘటనలు జరిగితే వాటిని రికార్డ్ చేయడానికి 'డిజిటల్ డైరీ' విధానాన్ని తీసుకువచ్చారు.ఈ స్థానిక ఎన్నికలను కేవలం ఒక పోటీలా కాకుండా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుండి తిరిగి బలోపేతం చేసుకునే ఒక ప్రక్రియగా జగన్ భావిస్తున్నారు. అందుకోసం రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు చూసి క్యాడర్ లోనూ కసి పెరుగుతుందని, అది తమకు వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేశారు. అనుకున్నట్లుగానే క్యాడర్ ఏకతాటిపైకి రావడంతో జగన్ పాచిక పారినట్లయింది. అధికార కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుని పటిష్టంగా ఉన్న నేపథ్యంలో, జగన్ ముందస్తు వ్యూహాలు మరియు ఒంటరి పోరాటం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓటర్లను ఆకర్షిస్తాయనే దానిపైనే ఆయన "పాచిక" సక్సెస్ ఆధారపడి ఉంటుంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటే అది తమకు కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు జగన్.

# డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిస్తారా? బీజేపీని వ్యతిరేకిస్తారా?

**విజయవాడ ,అక్టోబరు 21 పెన్ పవర్:**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు మద్దతివ్వడంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు. అలాగే కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులకు బహిరంగ మద్దతు తెలపడం జాతీయ రాజకీయాల్లో సరికొత్త రగడను రాజేసింది. గతంలో పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వానికి బేషరతుగా మద్దతు ఇచ్చి తప్పు చేశానని, చట్ట సవరణల విషయంలో పరోక్షంగా పశ్చాత్తాపపడిన జగన్, ఇప్పుడు నిజంగానే ఆచరణాత్మక వ్యతిరేకతను ప్రదర్శిస్తారా అనే చర్చ తీవ్రమవుతోంది. ఈ నెల చివర్లో లేదా రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో మోదీ ప్రభుత్వం అత్యంత కీలకమైన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోందనే ప్రచారంతో జగన్ తీసుకోబోయే స్టాండ్ ఆయన రాజకీయ భవిష్యత్తుకు కొలమానంగా మారనుంది.వైఎస్సార్‌సీపీకి ప్రస్తుతం లోక్‌సభ మ, రాజ్యసభల్లో ఉన్న సభ్యుల సంఖ్య స్వల్పమే అయినప్పటికీ, రాజ్యసభలో సంకీర్ణ సమీకరణాలు , విపక్షాల ఐక్యతను చాటడంలో ఆ కొద్దిమంది ఎంపీల ఓట్లు కూడా అత్యంత కీలకం కానున్నాయి. గత ఐదేళ్ల పాటు నల్లచట్టాలు, కీలకమైన బిల్లులు, డిప్యూటీ స్పీకర్ ఎన్నికల వరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మక మద్దతు ఇస్తూ వచ్చింది. అయితే, ఏపీలో 2024 ఎన్నికల ఓటమి తర్వాత, టీడీపీ-జనసేనలతో బీజేపీ జట్టుకట్టడంతో జగన్ ఒంటరి అయ్యారు. ఇప్పుడు కేంద్రానికి మద్దతిచ్చి తప్పు చేశానా? అనే ఆలోచనలో ఉన్న జగన్, రాబోయే డీలిమిటేషన్ చట్టసభల బిల్లు విషయంలో ధైర్యంగా వ్యతిరేక ఓటు వేయగలరా అన్నదే అసలైన ప్రశ్నగా మారింది.ఈ విమర్శలు, సవాళ్ల మధ్య వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ మాత్రం డీలిమిటేషన్ , మహిళా బిల్లులకు సూత్రప్రాయంగా మద్దతు ఇస్తామని

ఇప్పటికే కొన్ని వేదికలపై సూచనలు ఇచ్చింది. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనలు దేశాభివృద్ధికి, దశాబ్దాల కల నెరవేర్చడానికి అవసరమైన ప్రాథమిక సంస్కరణలు అనే వ్యాఖ్యలతో వైఎస్సార్‌సీపీ ఎంపీలు సమర్థించుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయంగా బీజేపీకి వ్యతిరేకమని చెప్తూనే, ఇటువంటి ప్రజామోదయోగ్యమైన బిల్లులను రాజకీయాలకు అతీతంగా దేశ ప్రయోజనాల కోసం మద్దతిస్తున్నాం అని జగన్ ప్రకటిస్తే, అది మళ్లీ ఆయన్ను పాత పరోక్ష మద్దతు వైఖరిలోనే నిలబెడుతుంది. ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి విశ్వసనీయతపై ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఢిల్లీ వీధుల్లో బీజేపీకి వ్యతిరేకంగా నిరసన తెలిపే ప్రొటెస్ట్ గ్రూపులకు, ఈసీ వ్యతిరేక ఉద్యమాలకు ట్విట్టర్ వేదికగా బాహాట మద్దతు ఇవ్వడం, మరోవైపు పార్లమెంట్ భవనంలోకి వచ్చేసరికి అదే బీజేపీ తీసుకొచ్చే రాజ్యాంగ సవరణ బిల్లులకు అనుకూలంగా ఓటు వేయడం ద్విముఖ వైఖరిని ఎండగడుతోంది. గతంలో తప్పు చేశానని జనం ముందు చెప్పడం, తీరా నిర్ణయాత్మక ఘట్టం వచ్చేసరికి మళ్లీ అదే తప్పును పునరావృతం చేయడం జగన్ రాజకీయ అనిశ్చితికి నిదర్శనం అని ప్రతిపక్షాలు ఎద్దేవా చేసే అవకాశం ఉంది. మరో కోణంలో చూస్తే, జగన్ ముందు రెండు స్పష్టమైన మార్గాలు

మాత్రమే మిగిలాయి. మొదటిది.. తాము విధానపరంగా బీజేపీతో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నామని నిరూపించుకోవడానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి కీలక బిల్లును సూటిగా వ్యతిరేకించడం, తద్వారా జాతీయ స్థాయిలో ఇండియా కూటమి లేదా ఇతర తటస్థ విపక్షాల సరసన నిలవడం. రెండోది.. జాతీయ అంశాలు వేరు, ప్రాంతీయ రాజకీయాలు వేరు అని చెప్తూ, భవిష్యత్తులో కేసుల ఒత్తిడి , కేంద్ర యంత్రాంగం నుంచి ఉపశమనం కోసం బిల్లులకు మద్దతు నిరంతరం కొనసాగించడం. కానీ, రెండో మార్గాన్ని ఎంచుకుంటే మాత్రం మళ్లీ తప్పు చేశానని భవిష్యత్తులో చింతించాల్సి వస్తుందనే విమర్శలను ఆయన తప్పించుకోలేరు. బిల్లులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నైతిక రాజకీయాలకు, సిద్ధాంతపరమైన స్టాండ్‌కు అసలైన అగ్నిపరీక్షగా మారనున్నాయి. మాటల్లో బీజేపీ వైఖరిని, ఎన్నికల వ్యవస్థను తప్పుబడుతున్న జగన్, చేతల్లో పార్లమెంట్ వేదికగా ఓటింగ్ సమయానికి ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ నిర్ణయమే రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ జాతీయ స్థాయి రాజకీయ భవిష్యత్తును, మిత్రులెవరో శత్రువులెవరో తేల్చే కీలక ఘట్టం కానుంది.

# 40 ఏళ్ల అనుభవానికి అవమానం.. మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి కన్నీటి పర్యంతం, టీడీపీకి గుడ్ బై



**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికలు శ్రీకాకుళం టీడీపీలో ముసలం పుట్టించాయి. సిక్కోలు కార్పొరేషన్ సీటు ఇస్తామని ఆశ చూపి, ఇప్పుడు జనసేనకు కేటాయించడంపై మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మనస్తాపానికి గురయ్యారు. పార్టీలో తమ కుటుంబానికి అన్యాయం జరుగుతోందని, 40 ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్నందుకు అడుగడుగునా అమానిస్తున్నారని ఆరోపిస్తూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు లక్ష్మీదేవి ప్రకటించారు. ఆమె భర్త మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ 1983 నుంచి 2004 వరకు శ్రీకాకుళం ఎమ్మెల్యేగా పనిచేశారు. లక్ష్మీదేవి 2014 నుంచి 2019వరకు ఎమ్మెల్యేగా వ్యవహరించారు. అయితే 2024 ఎన్నికల్లో గుండ కుటుంబాన్ని తప్పించి, మేయర్ సీటు ఇస్తామని పార్టీ అధిష్టానం ప్రతిపాదించినట్లుగా చెబుతున్నారు. అయితే ఇప్పుడు సర్దుబాట్లలో భాగంగా జనసేనకు కేటాయించడాన్ని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు.

**40 ఏళ్ల బంధం.. కన్నీటి పర్యంతం**

టీడీపీకి రాజీనామా చేయాల్సిన పరిస్థితులను వివరిస్తూ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కన్నీటి పర్యంతం అయ్యారు. శ్రీకాకుళంలో టీడీపీకి వెన్నుదన్నుగా వస్తున్న గుండ కుటుంబం ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సిరావడంపై కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళంలో పార్టీ పురోగతి కోసం మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులు ఎంతో కృషి చేశారని చెబుతున్నారు. అయితే వయోభారం వల్ల గుండ అప్పలసూర్యనారాయణ ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారని, అయినప్పటికీ తన భార్యను ముందుంచి పెద్దదిక్కుగా పార్టీని నడిపించారని గుర్తు చేస్తున్నారు. ఆయన మరణం తర్వాత పార్టీ అండగా నిలవాల్సిందిపోయి మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని అవమానించేలా వ్యవహరించడంతోనే రాజీనామా నిర్ణయం తీసుకుందని విశ్లేషిస్తున్నారు.

**మేయర్ సీటుపై పేచీ**

గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీకి గుండ లక్ష్మీదేవి ప్రయత్నించారని చెబుతున్నారు. అయితే అధిష్టానం కొత్తవారికి యువతకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనతో ప్రస్తుత ఎమ్మెల్యే శంకర్ కు టికెట్ ఇచ్చిందని చెబుతున్నారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవికి శ్రీకాకుళం నగర మేయర్ పదవి ఇస్తామని ఆశ పెట్టినట్లుగా చెబుతున్నారు. ఈ కారణంగా అప్పట్లో గుండ కుటుంబం కూడా అధిష్టానంతో రాజీ పడిందని అంటున్నారు. అయితే మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ మరణం, గుండ కుటుంబంలో రాజకీయంగా చురుగ్గా తిరిగే వారు లేరన్న ఆలోచనతో సిట్టింగ్ ఎమ్మెల్యే శంకర్ పట్టుబిగించినట్లు చెబుతున్నారు. లక్ష్మీదేవిని మేయర్ చేస్తే మరో అధికార కేంద్రం తయారు చేసినట్లు అవుతుందన్న భావనతో వ్యూహాత్మకంగా మేయర్ సీటును జనసేనకు వదిలేశారని అంటున్నారు. ఇది గమనించిన లక్ష్మీదేవి పార్టీలో తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతుందని భావిస్తూ తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయానికి వచ్చారని అంటున్నారు.

**విగ్రహం పెట్టనీయలేదన్న ఆవేదన**

ఇక టీడీపీకి మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి రాజీనామా చేయడానికి అనేక కారణాలు ఉన్నాయని అంటున్నారు. ప్రధానంగా మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ మరణించిన తర్వాత నగరంలో ఆయన విగ్రహం పెట్టాలని అభిమానులు భావించారని చెబుతున్నారు. ఈ ప్రతిపాదనను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినా, స్థానికంగా అడ్డంకులు సృష్టించడంపై మాజీ ఎమ్మెల్యే అసంతృప్తికి లోనరయ్యారని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఈ విషయంలో సానుకూలంగా ఉన్నప్పటికీ కలెక్టర్ ద్వారా స్థానిక నాయకులు అడ్డుకున్నారని మాజీ ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు. దీంతో పార్టీలో 40 ఏళ్ల సేవలకు కూడా గుర్తింపు దక్కలేదన్న ఆవేదన ఆమెలో కనిపిస్తోందని అంటున్నారు.

**వైసీపీలో చేరతారా?**

టీడీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి భవిష్యత్తు రాజకీయాలపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. టీడీపీ ఆవిర్భావం నుంచి పసుపు కండువాతోనే రాజకీయం చేసిన లక్ష్మీదేవి తాజా పరిణామాలతో వైసీపీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. త్వరలో జరగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ తరపున మేయర్ సీటు ఇస్తామని ఆ పార్టీ నుంచి ఆఫర్ ఉందని అంటున్నారు. ఈ కారణంతోనే లక్ష్మీదేవి రాజీనామా నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. అయితే లక్ష్మీదేవిని నచ్చజెప్పే ప్రయత్నాలు ఒకవైపు జరుగుతున్నాయని, మాజీ ఎమ్మెల్యేను టీడీపీ అంత తేలిగ్గా వదులుకోదని మరోవైపు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం రాజకీయం ఆసక్తికరంగా మారిందని చెబుతున్నారు.

# జగన్‌ను ర్యాగింగ్ చేసిన విజయసాయి!

**విజయవాడ ,అక్టోబరు 21 పెన్ పవర్:** మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి దసరా పండుగ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి సంబంధించిన ముహూర్తాన్ని, ఆశయాలను వెల్లడిస్తూ కీలక ప్రకటన చేశారు. ఈ క్రమంలో ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలే ఎజెండాగా కొత్త పార్టీ ఆవిర్భవించబోతోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2 పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలకడం, కులపిచ్చి, మతపిచ్చి రాజకీయాలను రూపుమాపడమే



లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. అలాగే రెడ్ బుక్ రాజ్యాంగం, రప్పారప్పా ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించి, కరువు కాటకాలు, కరెంటు కోతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామని దసరా పండుగరోజు మాజీ ఎంపీ ప్రకటించారు.విజయసాయిరెడ్డి తన కొత్త పార్టీ ప్రకటన తేదీని, ముహూర్తాన్ని ప్రకటించారు. అన్నీ పదకొండులు వచ్చేలా చూసుకున్నారు. గతంలో దసరాకే పార్టీ పెడతానని చెప్పిన ఆయన .. పార్టీ పెట్టే రోజును దసరా రోజునుప్రకటించారు. ఆ రోజును, ముహూర్తాన్ని చూస్తే ఆయన జగన్ రెడ్డిని ర్యాగింగ్ చేశారని సులువుగా అర్థమైపోతుంది. 11వ నెల 11వ తేదీన సరిగ్గా ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ-కన్వెన్షన్‌లో నూతన పార్టీని ఘనంగా ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు.గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘోర పరాజయం పాలై కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. అప్పట్నుంచి 11 అంటే వైసీపీ నేతలు ఉలిక్కి పడుతున్నారు. విపక్ష హోదా కూడా దక్కకుండా చేసిన ఆ 11 సంఖ్య జగన్‌కు, వైఎస్సార్సీపీ శ్రేణులకు రాజకీయంగా ఒక పెద్ద పీడకలగా మారింది. అలాంటి పచ్చి పుండుపై కారం చల్లేలా.. విజయసాయిరెడ్డి తన పార్టీ ప్రకటన ముహూర్తంలో నెల, తేదీ, గంటలు, నిమిషాలు అన్నీ కలిపి వరుసగా 11:11:11:11 వచ్చేలా పక్కాగా సెట్ చేశారు. గతంలో జగన్‌కు ఆర్థిక, రాజకీయ సలహాదారుగా నిలిచి లెక్కల మాస్టారు గా పేరుగాంచిన సాయిరెడ్డి.. ఇప్పుడు అదే లెక్కలతో జగన్ ఓటమి సంఖ్యను గుర్తుచేస్తూ పబ్లిక్‌గా ట్రోల్ చేశారుకేవలం ముహూర్తంతోనే ఆగకుండా పార్టీ ఎజెండా ద్వారా కూడా జగన్ పాలనను, వైఎస్సార్సీపీ మూలాలను విజయసాయిరెడ్డి తీవ్రంగా ఎద్దేవా చేశారు. రెండు పార్టీలు, రెండు కుటుంబాల దోపిడీకి ముగింపు పలికేలా.. రప్పరప్ప ఫ్యాక్షన్ల నుంచి విముక్తి కల్పించేలా.. జెన్-జీ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా తమ పార్టీ వస్తోందని పోస్టర్‌లో పేర్కొనడం జగన్‌ను నేరుగా టార్గెట్ చేయడమే. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత ప్రయోజనాలు చూసుకున్నారని, యువతను కేవలం జేజేలు కొట్టే గుంపులుగా మార్చారని దశకంఠుడి అవలక్షణాలంటూ 10 పాయింట్లతో జగన్ రాజకీయ తీరును ఉతికి ఆరేశారు. నిన్నటిదాకా తమతో ఉన్న ముఖ్య నేతే ఇలా 11 నంబర్‌తో వ్యంగ్యాస్త్రాలు సంధించడం తాడేపల్లి ప్యాలెస్‌కు మింగుడుపడటం లేదుకొన్ని రోజుల కిందట విజయసాయిరెడ్డి పార్టీ ఆవిర్భావం ప్రకటన చేయాల్సి ఉండగా.. అనారోగ్యం కారణంగా వాయిదా వేసుకున్నట్లు ప్రకటించారు. ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్నానని, త్వరలోనే పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేస్తానన్నారు. అయితే వైసీపీ నుంచి బెదిరింపులకు పాల్పడటంతో ఆయన వెనక్కి తగ్గారని, మరికొన్ని వర్గాల వారు విజయసాయిరెడ్డిని భయపెట్టడంతో మాజీ ఎంపీ వెనక్కి తగ్గారని ప్రచారం జరిగింది. అయితే తాను పార్టీ పెట్టడంలో వెనక్కి తగ్గేదిలేదని, తనను ఎవరూ బెదిరించలేదన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు కోసం కచ్చితంగా తన పోరాటం కొనసాగుతుందన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఏపీ, తెలంగాణలో ఎక్కడెక్కడ వానలు పడతాయంటే?



ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వానలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో పాటు నైరుతి రుతు పవనాల ఎఫెక్ట్ తోనూ కొన్ని చోట్ల వానలు పడతాయని పేర్కొంది. వాతావరణ శాఖ అధికారుల అంచనా ప్రకారం కొన్ని చోట్ల మోస్తరు వానలు, మరికొన్ని చోట్ల తేలిక పాటి వానలు పడే అవకాశముందని తెలిపింది. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని కూడా సూచించింది. నేడు ఏర్పడనున్న అల్పపీడనం, వాయుగుండంగా మారి, తుపాను గా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని, కొన్ని చోట్ల పిడుగులు పడే ఛాన్స్ ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పింది.

**ఏపీ వెదర్ పై కీలక అప్ డేట్...**

ఆంధ్రప్రదేశ్ వాతావరణంపై అమరావతి వాతావరణ శాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. అనేక ప్రాంతాల్లో వానలు పడతాయని, మోస్తరు వానలు పడతాయని వాతావరణ శాక అధికారులు తెలిపారు. నేడు పలు చోట్ల వర్ష సూచన చేసింది. అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాలైన అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అదే సమయంలో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున రైతులు మరియు ప్రజలు చెట్ల కింద ఉండరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

**తెలంగాణలోనూ నేడు...**

తెలంగాణలోనూ నేడు వానలు పడతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాలకు వర్ష సూచన చేసింది. కొన్నిచోట్ల తేలికపాటి వానలు, మరికొన్ని చోట్ల మోస్తరు వానలు పడతాయని వాతావణ శాఖ అధికారులు తెలిపారు. దక్షిణ మరియు తూర్పు తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని చెప్పింది. బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయని పేర్కొంది. పగటిపూట ఉష్ణోగ్రతలు సుమారు 31 డిగ్రీల నుంచి 32 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల నుంచి 24డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. వాతావరణ శాఖ అధికారులు ఈనెల 24 వ తేదీ వరకూ కొంత ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందని పేర్కొంది.

# రూ.5 కోట్లతో డీఎన్ఏ డేటా స్టోరేజ్ ల్యాబ్.. పెట్టుబడులు దొరక్క అమెరికాకు వెళ్లిన 24 ఏళ్ల యువ...



భారతదేశం ఆవిష్కరణలకు మార్గదర్శిగా నిలుస్తోందని ఒకవైపు ప్రచారం జరుగుతుంటే.. మరొకవైపు అత్యాధునిక సాంకేతిక రంగాలు.. పరిశోధనల ఆధారిత ప్రాజెక్టులకు నిధులు దొరకక యువ పారిశ్రామికవేత్తలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇందుకు నిదర్శనంగా బెంగళూరుకు చెందిన 24 ఏళ్ల యువ పారిశ్రామికవేత్త అనఘా రాజేష్ అనుభవం ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీసింది.

**వినూత్న ప్రయోగం: డీఎన్ఏ డేటా స్టోరేజ్**

అనఘా రాజేష్ బెంగళూరులో 'బయోకంప్యూట్' పేరుతో ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ ముఖ్య ఉద్దేశం డిజిటల్ సమాచారాన్ని డీఎన్ఏ అణువుల్లో సురక్షితంగా నిల్వ చేసే సాంకేతికతను అభివృద్ధి చేయడం. సాధారణంగా మనం వాడే హార్డ్‌డిస్కులు, క్లౌడ్ స్టోరేజ్‌లతో పోలిస్తే డీఎన్ఏ ద్వారా అత్యంత ఎక్కువ డేటాను శతాబ్దాల పాటు సురక్షితంగా భద్రపరచవచ్చు. ఈ అత్యాధునిక పరిశోధనల కోసం ఆమె సుమారు రూ. 5 కోట్లు ఖర్చు చేసి ల్యాబ్‌ను నిర్మించారు.

**పెట్టుబడుల నిరాశ.. ల్యాబ్ విక్రయం**

డాక్టర్ రాజేశ్వరి అయ్యర్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో పంచుకున్న కథనం ప్రకారం.. ఈ ప్రాజెక్టును తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు.. వ్యాపార విస్తరణకు అవసరమైన ఆర్థిక సహకారం భారత్‌లో లభించలేదు. మన దేశంలో చాలామంది వెంచర్ క్యాపిటలిస్టులు, పెట్టుబడిదారులు తక్షణమే లాభాలు తెచ్చిపెట్టే బిజినెస్ మోడళ్లపైనే శ్రద్ధ చూపిస్తారని.. సుదీర్ఘ కాలం పరిశోధనలు అవసరమయ్యే డీప్‌టెక్ రంగాలపై రిస్క్ తీసుకోవడానికి ముందుకు రారని విమర్శలు వెల్లువెత్తాయి. సరైన ప్రోత్సాహం, నిధులు అందకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన అనఘా.. చివరకు తన రూ. 5 కోట్ల విలువైన ల్యాబ్‌ను అత్యల్ప ధరకే విక్రయించి అమెరికాకు వెళ్లాల్సి వచ్చింది.

**అమెరికాలో లభించిన ఆదరణ**

భారత్‌లో నిరాశ ఎదురైనప్పటికీ అమెరికా వెళ్లిన తర్వాత అనఘా బిజినెస్ మోడల్‌పై అక్కడి పెట్టుబడిదారులు తీవ్ర ఆసక్తిని కనబరిచినట్లు సమాచారం. అక్కడ రిస్క్ క్యాపిటల్ , డీప్‌టెక్ స్టార్టప్‌లకు విస్తృతమైన సహకారం లభించడమే ఇందుకు కారణం. ఈ సంఘటన భారతదేశంలో డీప్‌టెక్ వ్యవస్థ బలోపేతం కావలసిన అవసరాన్ని స్పష్టంగా ఎత్తిచూపుతోంది. క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్ వంటి రంగాల్లో ఫలితాలు రావడానికి సమయం పడుతుంది. ఇటువంటి వినూత్న ఆలోచనలు ఉన్న యువత దేశం విడిచి వెళ్లకుండా ఉండాలంటే.. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, దీర్ఘకాలిక పెట్టుబడులు, గ పరిశోధనా వాతావరణాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# జగన్ దారి ఫిక్స్.. అటు వైపు పయనిస్తున్నారటగా?




వైసీపీ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో గళం విప్పనుందని తెలుస్తోంది. వైసీపీ ధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు కొంత కలకలం రేపుతున్నాయి. తాము కేంద్ర ఎన్నికల కమిషన్ నియామకంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతిచ్చి తప్పు చేశామని జగన్ చెప్పడాన్ని బట్టి ఇక ఢిల్లీపై పోరుకు జగన్ సిద్ధమయినట్లు కనిపిస్తుంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి గతంలో కొన్ని బిల్లుల విషయంలో మద్దతు ఇవ్వడంపై విచారం వ్యక్తం చేశారు. అయితే, ఆయన నేరుగా బీజేపీకి క్షమాపణలు చెప్పలేదు, కానీ కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు-2023 విషయంలో నాడు ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి పెద్ద తప్పు చేశామని వ్యాఖ్యానించారు. దీంతో వైసీపీకి, బీజేపీకి ఇప్పుడు మరింత దూరం పెరిగిందని చెప్పొచ్చు. పార్టీ 2024 ఎన్నికలలో ఓటమి పాలయినా జగన్ పార్టీ బీజేపీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకు మద్దతిచ్చింది.

**కీలక బిల్లులకు మద్దతు ఇచ్చి...**

2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక సవరణ బిల్లుకు తాము మద్దతు ఇవ్వడం పొరపాటని జగన్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని నియామక కమిటీ నుంచి తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చారు. దీనికి వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై, ఓటర్ల జాబితాల సవరణపై దేశవ్యాప్తంగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జగన్ స్పందించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ప్రజల్లో నమ్మకం కలగాలంటే మళ్లీ పాత నియామక పద్ధతినే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కమిటీలో ఉండేలా పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.తాము గతంలో కేంద్రానికి కేవలం అంశాల వారీగా మాత్రమే మద్దతు ఇచ్చామని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందని వైసీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

**కాంగ్రెస్ లో చేరతారన్న...**

అయితే జగన్ కాంగ్రెస్ నేతృత్వం వహిస్తున్న ఇండియా కూటమిలో భాగస్వామిగా మారతారని మాత్రం అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే కాంగ్రెస్ జగన్ కు ప్రధాన శత్రువు. అందుకే దానికి దూరంగా ఉండే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి. అలాగని బీజేపీకి కూడా దగ్గరయ్యే ఛాన్సులు లేవు. ప్రస్తుతం పార్లమెంటులో ఏదైనా కీలకమైన బిల్లుల విషయంలో జగన్ పార్టీ ఇటు మద్దతు, అటు వ్యతిరేకత తెలపకుండా వాకౌట్ చేసే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరొకవైపు తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ బీజేపీ, కాంగ్రెస్ కు వ్యతిరేకంగా తృతీయ కూటమిని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉంది. అందులో భాగంగా జగన్ తో డీఎంకే నేతలు సంప్రదింపులు జరిపితే కొంత వరకూ ఆ కూటమిలో చేరే అవకాశముంది. మొత్తం మీద జగన్ దారి ఎటన్నది రాజకీయంగా చర్చనీయాంశమైంది. రానున్న కాలంలో దీనిపై పూర్తి స్థాయిలో క్లారిటీ రానుంది.

# "సేన" నేతలు చేతులెత్తేశారా? లోకల్ ఎన్నికల్లో దూరం పాటిస్తారా?

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ వ్యూహాలు మరియు అభ్యర్థుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థుల ఎంపిక జనసేన నేతల్లో అసంతృప్తిని రగిలించింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని పార్టీలోకి తీసుకుని టిక్కెట్లు ఖరారు చేయడంతో పాటు అసలైన నేతలను పక్కనపెట్టడంతో స్థానిక నేతలు పార్టీ నాయకత్వం తీరుపై బాహాటంగా విరుచుకుపడుతున్నారు. సోషల్ మీడియా వేదిగా తిరుగుబాటు బావుటాను కొందరు ఎగరేస్తున్నారు. పవన్ కల్యాణ్ చెప్పిన మాటలకు, అభ్యర్థుల ఎంపికయిన తీరుకు మధ్య పొంతన లేకుండా ఉందని వారు ఆరోపిస్తున్నారు. జనసైనికులు, వీర మహిళలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తామని పవన్ కల్యాణ్ మాటలు చేతల్లో కనిపించలేదని, జనసేనలో కొనసాగేకంటే ఇతర పార్టీలకు వెళ్లి టిక్కెట్ తెచ్చుకోవడం సులువన్న అభిప్రాయం పార్టీకి చెందిన నేతలల్లో వ్యక్తమవుతుంది. ఇది రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశముంది.

**అభ్యర్థుల ఎంపిక లో...**

పార్టీ తీసుకున్న కొన్ని నిర్ణయాలు మరియు సీట్ల సర్దుబాటు కేడర్‌లో అంతర్మథనానికి, అసంతృప్తికి దారితీసినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితులు జనసేనకు ఇబ్బందికరంగా మారాయన్నారు.ప్రారంభంలో జనసేన పార్టీ కూటమిలో భాగంగా సుమారు 40 శాతం స్థానాలను డిమాండ్ చేసింది. కానీ ఆశించిన స్థాయిలో సీట్లు దక్కకపోవడంతో పార్టీ కార్యకర్తలు మరియు దిగువ స్థాయి నాయకులు నిరాశకు గురైనట్లు వార్తలు వస్తున్నాయి.పార్టీ ఆవిర్భావం నాటి నుండి కష్టపడి, గత స్థానిక ఎన్నికల్లో ఒంటరిగా పోరాడి గెలిచిన స్థానాలను కూడా ఈసారి కూటమి ఒప్పందాల వల్ల వదులుకోవాల్సి రావడంపై జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఇన్నాళ్లు కష్టపడి, సొంత సొమ్మును ఖర్చు ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు.




జనసేనలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వలస నాయకులకు ప్రాధాన్యత ఇచ్చారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**అసలైన వారులేరా?**

కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ కోసం మొదటి నుంచి నిలబడిన గ్రౌండ్-లెవల్ కార్యకర్తలను పక్కన పెట్టి, ఎన్నికల సమయంలో చేరిన వారికి లేదా ఇతర సమీకరణాల ఆధారంగా టిక్కెట్లు కేటాయిస్తున్నారనే విమర్శలు అంతర్గతంగా వినిపిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికలో క్షేత్రస్థాయి కార్యకర్తల సెంటిమెంట్లను గౌరవిస్తూనే, కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా నిర్ణయాలు తీసుకుంటున్నామని జనసేన అగ్రనాయకత్వం చెబుతోంది. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనేందుకు "సింగిల్ ఎజెండా"తో బలమైన అభ్యర్థులనే నిలబెడుతున్నట్లు నాయకులు స్పష్టం చేస్తున్నారు. కూటమి పార్టీల మధ్య ఎక్కడా స్నేహపూర్వక పోటీలు ఉండబోవని, అంతా కలిసి ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని జనసేన నేతలు ప్రకటించారు. ఇప్పటికే జనసేన పార్టీ తన అభ్యర్థుల ఎంపిక పూర్తి కావడంతో వారు నిరాశలో పార్టీ కార్యక్రమాలకు కొందరు దూరంగా ఉన్నారు. కూటమి రాజకీయాల్లో సీట్ల సర్దుబాటు వల్ల సొంత పార్టీ కేడర్‌లో కొంత భంగపాటు మరియు అసంతృప్తి సహజమే అయినప్పటికీ, దీనిని జనసేన అధినాయకత్వం ఎలా సమన్వయం చేస్తుందనే దానిపైనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి

# పసిడి కొనుగోలు దారులకు అలెర్ట్




బంగారం ధరలు తగ్గుతున్నాయి. పెరుగుతున్నాయి. స్థిరంగా కొనసాగుతున్నాయి. ఒకరోజు ధరలు పెరిగితే మరుసటి రోజు ధరలు తగ్గుతున్నాయి. బంగారం, వెండి ధరల్లో స్థిరత్వం లేకపోవడంతో కొనుగోలు దారులు కొనుగోలు చేయడం మంచిదా? కాదా? అన్న మీమాసంలో పడ్డారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితి బులియన్ మార్కెట్ లో నెలకొందని చెప్పాలి. ధరలు పెరుగుతాయని కొందరు, తగ్గుతాయని మరికొందరు అంచనా వేస్తున్నారు. కానీ ఎవరి అంచనాలు నిజం కావడం లేదు. ధరలు పెరుగుతాయని భావించి కొనుగోలు చేస్తే తగ్గుతున్నాయి. అలాగే తగ్గుతాయని వెయిట్ చేస్తే పెరుగుతుండటంతో కొనుగోలు దారులు అయోమయంలో పడ్డారు.

**బంగారాన్ని కొనాలంటే?**

బంగారం అనేది ప్రస్తుతం ఒక కలగా మారింది. బంగారాన్ని కొనుగోలు చేయాలంటే ఒక యజ్ఞం చేసినట్లే అవుతుంది. నచ్చిన డిజైన్లు జ్యుయలరీ దుకాణాల్లో ఊరిస్తున్నాయి. అలాగే తమకు ఇష్టమైన నగలు కొనుగోలు చేయాలంటే అవసరమైన శక్తికి మించిన భారంగా ఉంది. అయినా కొనుగోలు చేస్తే భవిష్యత్ లో ధరలు తగ్గుతాయా? పెరుగుతాయా? అన్నది మాత్రం తేలకుండా ఉంది. అందుకే బంగారం విషయంలో ఎలాంటి అడుగు వేయలేకపోతున్న అనేక మంది ఇతర మార్గాల వైపు వెళు తున్నారు. బంగారంపై పెట్టుబడి ఒకప్పుడు సురక్షితమైనది. కానీ నేడు ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొని ఉందని మార్కెట్ నిపుణులే అంగీకరిస్తున్నారు.

**పెరుగుతూ.. తగ్గుతూ...**

గత కొన్ని రోజులుగా తగ్గిన బంగారం ధరలు నిన్న ఒక్కసారిగా పెరిగాయి. కానీ నేడు మళ్లీ తగ్గాయి. దీంతో ఇలా అనిశ్చితి కొనసాగుతుండటంతో పెట్టుబడి దారులు కూడా మదుపు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఫలితంగా బంగారం, వెండి మార్కెట్లు మరింతగా నష్టపోతున్నాయి. అమ్మకాలు తగ్గుతున్నాయి.

ఈరోజు దేశంలో బంగారం ధరలు తగ్గాయి. వెండి ధరలు తగ్గాయి. కిలో వెండి ధరపై వంద రూపాయలు తగ్గింది. ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో నమోదయిన బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,33,890 రూపాయలుగా నమోదయింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,46,070 రూపాయలుగా కొనసాగుతుంది. కిలో వెండి ధర 2,29,000 రూపాయలుగా ట్రేడ్ అవుతుంది. మధ్యాహ్నానికి ధరల్లో మార్పులుండవచ్చు. ఉండకపోవచ్చు. కొనుగోలుదారులు చూసి కొనుగోలు చేయాలి.

# భయపెడుతున్న పందెం!?

కృత్రిమ మేధ మానవ మనుగడకే ముప్పు కావొచ్చని హెచ్చరిస్తున్న సంస్థలే, ఆ సాంకేతికతపై లక్షల కోట్లు కుమ్మరిస్తున్నాయి. ఇది నిజమైన భయమా? లేక పెట్టుబడులను ఆకర్షించే వ్యూహమా? అన్న చర్చ బిగుస్తోంది. విమర్శకులు దీన్ని "భయమే అమ్మకపు సరుకు" అంటుంటే, పోటీ ఉచ్చులో చిక్కుకున్న సంస్థలు ఆగలేకపోతున్నాయని మరికొందరి వాదన. ఎవరి వాదన నిజమైనా, ఇంతటి శక్తిని కొద్ది ప్రైవేట్ సంస్థల చేతుల్లోనే వదిలేయడం సరైనదేనా? అన్నది అసలు ప్రశ్న. నిజానికి –ఇది ఏఐ ప్రపంచానికి ఒక విచిత్రమైన వైరుధ్యం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో యాంత్రోపిక్ సంస్థను వదిలిన పరిశోధకుడు జాకబ్ కాక్సన్, ఈ పోటీ "మన ప్రాణాలతో చెలగాట"మని బహిరంగంగా ప్రకటించారు. ఆ సంస్థలోని అలైన్‌మెంట్ సైన్స్ విభాగాధిపతి ఎవాన్ హబింగర్, దశాబ్దంలో మానవ వినాశనానికి 10 శాతానికి మించి అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుత మోడళ్లతో ప్రమాదం తక్కువేనని, భయమంతా స్వయంగా తన సామర్థ్యాన్ని పెంచుకునే భవిష్యత్ సూపర్‌ఇంటెలిజెన్స్ గురించేనన్నది హబింగర్ మాట. ఓపెన్‌ఏఐ అధినేత సామ్ ఆల్ట్‌మన్ కూడా ఈ స్థాయి ప్రమాదం "ఆమోదయోగ్యం కాదు" అన్నారు. ఈ ఏడాది ఐపీఓకు వెళ్లబోమని ప్రకటించారు. మరోవైపు, వాస్తవ ఖర్చుల లెక్కలు వేరే కథ చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్, అమెజాన్, మెటా, ఒరాకిల్ అనే ఐదు పెద్ద సంస్థలు 2026లో దాదాపు 660 నుంచి 690 బిలియన్ డాలర్లు మూలధన వ్యయంగా పెడతామని ప్రకటించాయి. అది గత ఏడాదికి దాదాపు రెట్టింపు. ఇందులో మూడొంతులు ఏఐ మౌలిక సదుపాయాలకే వెళ్తోంది. ఇంత వేగం ఇంటర్నెట్ కాలంలో కానీ, క్లౌడ్ విస్తరణ కాలంలో కానీ కనిపించలేదన్నది విశ్లేషకుల మాట. కొన్ని సంస్థలు ఈ ఖర్చుకు అప్పులపై ఆధారపడటమే అసలు ప్రశ్నగా కనిపిస్తోంది. ఇది వ్యాపార వ్యూహమా, లేక తప్పించుకోలేని పరిస్థితా? ప్రపంచ విశ్లేషకుల్లో ఈ విషయంలో స్పష్టమైన రెండు శిబిరాలు కనిపిస్తున్నాయి. ఈ రెండిటి వాదనలనూ నిష్పక్షపాతంగా చూడటం సరైన పద్ధతి.

మొదటి శిబిరం ఇది వ్యూహమేనంటుంది. వారి వాదన ప్రకారం, ఒక ఉత్పత్తి మనల్ని నాశనం చేయగలదని చెప్పడం, అది ఎంత శక్తిమంతమో చాటుకోవడానికి ఉత్తమ మార్గం. గూగుల్ బ్రెయిన్ సహ స్థాపకుడు ఆండ్రూ ఎన్‌జీ చాలా కాలంగా ఇదే చెబుతున్నారు. కొన్ని సంస్థలు నిధుల సేకరణ కోసం హైప్ సృష్టించాయని, "ఏఐ అందరి ఉద్యోగాలూ తీసేస్తుంది" వంటి కథనాలు ప్రజల అవగాహనను వక్రీకరించాయని అంటారు. ఎన్విడియా అధినేత జెన్సెన్ హువాంగ్ ఇంకో కోణం చెప్పారు, కంపెనీలే ప్రభుత్వాల వద్దకు వెళ్లి మరిన్ని నియంత్రణలు కోరడం "రెగ్యులేటరీ క్యాప్చర్" అవుతుందని, ప్రమాద భయం పెట్టుబడులను అడ్డుకుంటోందని. ఈ విమర్శకుల లెక్కలో మూడు ప్రయోజనాలు కనిపిస్తాయి. మొదటిది, "ఇది యుగాన్ని మార్చే సాంకేతికత" అనే కథ బతికి ఉంటే కొత్త నిధులు, ఐపీఓ అవకాశాలు సులువవుతాయి. రెండవది, నిబంధనల రూపకల్పనలో పెద్ద సంస్థలకే పెద్ద పాత్ర దక్కితే, చిన్న పోటీదారులు ఆ గోడను దాటలేరు. మూడవది, ఏదైనా తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదో నిర్ణయించే చట్రాన్ని ముందే తమకు అనుకూలంగా మలుచుకోవచ్చు. "భయం వారి అమ్మకపు సరుకే"నని వాదించే కథనాలు కూడా ఇప్పుడు వస్తున్నాయి. ఆర్థిక వైపునుంచి చూసినా ఈ అనుమానాలకు ఆధారం ఉంది. ఒక అంచనా ప్రకారం 2025లో ఏఐ సేవల ద్వారా వచ్చిన ఆదాయం పెట్టిన మౌలిక వ్యయంలో పదో వంతు మాత్రమే. మూలధన వ్యయం ఆదాయ వృద్ధి కన్నా చాలా వేగంగా పెరుగుతోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. 1998–2001 నాటి ఫైబర్ ఆప్టిక్ బుడగను గుర్తు చేస్తున్నారు. ఇటీవలి మదుపరుల సర్వేలో కూడా, ఏఐవల్ల లాభాలు వస్తున్నాయని అంగీకరించిన వారిలో చాలామంది, పెడుతున్న డబ్బుకు తగిన ప్రతిఫలం రావడం లేదనీ అన్నారు. అంటే ప్రమాదం గురించి చేసే ప్రకటనలు, భారీ పెట్టుబడులకు సమర్థన ఇచ్చే ఒక కథనంగా కూడా పనిచేస్తున్నాయని విమర్శకుల వాదన.

రెండవ శిబిరం మాత్రం, ఇదంతా కేవలం మార్కెటింగ్ అని కొట్టిపారేయడం సరికాదంటుంది. ఈ వాదనలో అసలు సమస్య భయమూ కాదు, లాభమూ కాదు, పోటీ అనే ఉచ్చు! జాకబ్ కాక్సన్ వివరణ ఇదే. ప్రమాదాన్ని బాగా అర్థం చేసుకున్న సంస్థ కూడా, మరొకరు బాధ్యతారహితంగా ముందుకు వెళ్లి గెలుస్తారన్న భయంతో తానూ పరుగెత్తాల్సి వస్తోంది. గూగుల్ డీప్‌మైండ్ అధినేత డెమిస్ హసాబిస్ కూడా ఈ "రేస్ కండిషన్స్" ప్రమాదం గురించి హెచ్చరించారు. ఈ ఏడాది మార్చిలో యాంత్రోపిక్ తన భద్రతా నియమాల్లో కొన్నింటిని సడలించిందనే వార్తలు, పోటీ ఒత్తిడి ఎంత బలంగా ఉందో చూపాయి. భద్రతపై గట్టిగా మాట్లాడిన సంస్థలే చివరికి పోటీ ముందు తలవంచాయని మ్యాక్స్ టెగ్‌మార్క్ వంటి విమర్శకులు అన్నారు. ఒక కంపెనీ ఆగితే మరొకటి ఆ స్థానాన్ని భర్తీ చేస్తుందన్న భావన బలంగా ఉంది. దానికి దేశాల మధ్య పోటీ కూడా తోడైంది. అమెరికా ప్రభుత్వం ప్రధానంగా గెలవడంపైనే దృష్టి పెట్టిందని, అంతర్జాతీయ సమన్వయం లేనిదే ఒకరు ఆగినా లాభం లేదని విశ్లేషకులు అంటున్నారు. మరో ఆందోళనకర అంశం, కొన్ని సంస్థలు తమ మోడళ్లు పరీక్షల సమయంలో నియంత్రణ దాటి బయటి వ్యవస్థల్లోకి చొరబడిన ఘటనలను అంగీకరించడం. అంటే భయం పూర్తిగా కల్పితం కాదు. అయినా నిజం ఏమిటంటే, ఈ రెండు వాదనలూ ఒకదానికొకటి వ్యతిరేకం కావు. ఒకే సంస్థ ఒకేసారి ప్రమాదాన్ని నిజంగా నమ్మవచ్చు, ఆ భయాన్ని వ్యాపారానికి వాడుకోనూవచ్చు. కాబట్టి అసలు ప్రశ్న ఎవరు నిజాయతీపరులు అన్నది కాదు. ఇంతటి శక్తిని, ఇంత పెద్ద పందెంలో, కొద్ది ప్రైవేట్ సంస్థల నిర్ణయాలకే వదిలేయడం ఎంతవరకు సమంజసం అన్నదే. ఈ సంస్థలే నిబంధనలు రాయడం, పరీక్షలు జరపడం, లాభం పొందడం, అన్నీ చేస్తున్నాయి. ఇలాంటి విషయాల్లో స్వతంత్ర పర్యవేక్షణ, పారదర్శకమైన ప్రమాద నివేదికలు, అంతర్జాతీయ ఒప్పందాలు తప్పనిసరి. ఇందుకు స్వచ్ఛంద హామీలు చాలవు; ఆ వాగ్దానాలే చట్టాలుగా మారాలి. అప్పటివరకు భయం, పెట్టుబడి ఒకే నాణేనికి రెండు వైపులుగా నడుస్తూనే ఉంటాయి. ఆ నాణెం ఎటు పడుతుందో మనకు తెలియదు కాబట్టే, దాన్ని ఎగరేసే చేతులపై నిఘా అవసరం. ఏఐ మన భవిష్యత్తుకు దీపమవుతుందో, కాల్చే నిప్పవుతుందో నిర్ణయించేది దాన్ని నడిపే మనుషుల విజ్ఞతే. ఆ నిర్ణయం కొద్దిమంది బోర్డు రూముల్లో కాక, ప్రజాస్వామ్య చట్టాల వెలుగులో జరిగిననాడే ఈ పందెం.. మానవాళికి గెలుపవుతుంది!!

## పనికొచ్చే పలుకు



# వాళ్ల సలహాలే.. నీ జీవితమా!

రాత్రి పదకొండు. ఫోన్ చేతిలో, స్క్రోలింగ్ ఆగదు. ఒకడు "5ఏఎం క్లబ్‌లో చేరకపోతే నువ్వు లూజర్" అంటాడు. ఇంకొకడు "30 ఏళ్లలోపు కోటి సంపాదించకపోతే వేస్ట్" అంటాడు. మరొకరు నీ పోస్ట్‌కు కామెంట్ పెడతారు: "ఇంకా ఇదేనా నీ లెవెల్?" ఒక్క గంటలో నువ్వు ముగ్గురి తీర్పులు మోసి, ముగ్గురికీ సరిపోని మనిషిగా నిద్రపోతావు. ఇక్కడ ఆగి ఒక విషయం ఆలోచిద్దాం. ఈ తీర్పులన్నీ నిజంగా నీ గురించేనా?

విమర్శ అద్దం కాదు, ఫిల్టర్

ఎవరైనా నీ గురించి ఒక మాట అన్నప్పుడు, అది నీ నిజమైన ప్రతిబింబం కాదు. అది వాళ్ల కళ్లద్దాల రంగు. రోజూ ఆలస్యంగా లేచే వ్యక్తి "ఉదయం లేవడం వేస్ట్" అంటాడు, తన అపరాధ భావాన్ని కప్పిపుచ్చుకోవడానికి. ఇతరులు చేసే పనిలో తప్పులు వెతికేవాడు, సాధారణంగా తన పని చేయడానికి భయపడుతున్నవాడే. చాలా విమర్శల వెనుక ఉండేది నీ లోపం కాదు, వాళ్ల స్వీయ సందేహం, అభద్రత. నీ ఎదుగుదల వాళ్లకు తాము ఆగిపోయిన చోటును గుర్తు చేస్తుంది. అది బాధిస్తుంది కాబట్టి నిన్ను కిందకు లాగాలనుకుంటారు.

మూడు ఫిల్టర్ ప్రశ్నలు

ఏ మాట విన్నా, మనసులోకి పంపే ముందు ఇవి అడుగు.

ఈ మాట ఎక్కడి నుంచి వస్తోంది? నువ్వు వెళ్లాలనుకునే దారిలో ఇప్పటికే నడిచినవాళ్ల సలహా, బంగారం. ఆ దారి చూడనివాళ్ల తీర్పు, కేవలం శబ్దం.

ఇది ఎందుకు చెబుతున్నారు? నిజంగా నీ మంచి కోసమా, లేక తమ అభద్రతను దించుకోవడానికా, లేక వ్యూస్, లైక్స్ కోసమా? ఉద్దేశం మాటకంటే ముఖ్యం.

ఇందులో పని చేసే నిజం ఉందా? ఇదే అసలు పరీక్ష. చెప్పినవాడు నీకు నచ్చకపోయినా, మాటలో నిజం ఉంటే తీసుకో. ఎంత ఇష్టమైనవాడు చెప్పినా, నిజం లేకపోతే వదిలేయి. మనిషిని కాదు, మాటను జల్లెడ పట్టు.

లైఫ్‌స్టయిల్ మార్పు ఇక్కడే మొదలవుతుంది

చాలామంది జీవనశైలి మార్చుకోలేకపోవడానికి కారణం బద్ధకం కాదు, ఇతరుల అంచనాల బరువు. "ఇన్‌స్టాలో బాగా కనిపించాలి" అని బతికేవాడు, నిజంగా సుఖంగా ఉండే జీవితం ఎన్నడూ ట్రై చేయడు. కాబట్టి మార్పును ప్రదర్శన కోసం కాకుండా, నీ కోసం మొదలుపెట్టు.

ఈ చిన్న అలవాట్లు ప్రయత్నించు:

నిద్రకు ఫోన్ లేకుండా అరగంట. స్క్రీన్ దూరం పెడితే, తీర్పుల శబ్దం తగ్గుతుంది.

రోజుకు ఒక నడక. ఇయర్‌ఫోన్స్ లేకుండా పది నిమిషాలు. నీ ఆలోచనలు నీకే వినిపిస్తాయి.

వారానికి ఒక "మ్యూట్ డే". నీకు "సరిపోవు" అనిపించే అకౌంట్లను మ్యూట్ చేయి. అన్‌ఫాలో చేయాల్సిన పని కూడా లేదు, కొంత దూరం చాలు.

నీకు నువ్వే చెక్ ఇన్. రోజు చివర్లో ఒక్కటే అడుగు: "ఈ రోజు నేను నాకు నచ్చినట్టు బతికానా?"

ఒక గుర్తుంచుకోవాల్సిన మాట

ప్రపంచంలో అందరినీ మెప్పించిన మనిషి ఎవరూ లేరు. కానీ తమ మాటకు నిలబడి తమ జీవితాన్ని మార్చుకున్నవాళ్లు ఎందరో ఉన్నారు. విమర్శను పూర్తిగా వద్దనకు, పూర్తిగా మోయకు. జల్లెడ పట్టి, నిజాన్ని ఉంచుకుని, శబ్దాన్ని వదిలేయి. ఎందుకంటే నీ జీవితపు స్క్రిప్ట్‌కు ఎడిటర్ నువ్వే. కామెంట్ సెక్షన్ కాదు, గుర్తుంచుకో.

# పారిస్ నుంచి లిమోజ్ వరకు..!




ఫ్రాన్స్ ఇప్పుడు ఒక చేదు వాస్తవాన్ని ఎదుర్కొంటోంది. శాంతియుతంగా మొదలైన ప్రజాందోళన, చూస్తుండగానే హింస, దహనం, దోపిడీలుగా మారింది. అక్టోబర్ 17, శనివారం దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 5.5 లక్షలమంది పాల్గొన్నారు. అందులో పారిస్‌లోనే 1.1 లక్షలమంది ఉన్నారు. నిర్వాహకులైన కార్మిక సంఘాలు ఈ సంఖ్య 8 లక్షల వరకూ ఉందంటున్నాయి. పగటిపూట ర్యాలీలు ప్రశాంతంగానే సాగాయి. కానీ సాయంత్రానికి నల్లటి దుస్తులు వేసుకుని, ముఖాలకు మాస్కులు ధరించిన గుంపులు రంగంలోకి దిగడంతో పరిస్థితి అదుపు తప్పింది. పారిస్, మార్సెయ్, లియాన్, లిల్లే, బోర్డో, రెన్నెస్, గ్రెనోబుల్, నీస్, లిమోజ్‌వంటి నగరాల్లో కార్లు కాలిపోయాయి, దుకాణాల అద్దాలు పగిలాయి, వందలాది వ్యాపార సంస్థలు దోపిడీకి గురయ్యాయి. అన్నింటికన్నా ఎక్కువగా దేశాన్ని కలచివేసింది లిమోజ్‌లో 143 ఏళ్ల చరిత్ర ఉన్న నగరపాలక సంస్థ భవనం దగ్ధం కావడం. మంటల్లో పైకప్పు కూలిపోయి, భవనం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. అది ఉద్దేశపూర్వకంగా పెట్టిన నిప్పేనని స్థానిక ప్రిఫెక్ట్ స్పష్టం చేశారు. లియాన్‌లో పర్యాటక సమాచార కేంద్రం మంటల్లో చిక్కుకుంది. మార్సెయ్‌లో సిటీ హాల్‌లోకి నిరసనకారులు చొరబడ్డారు. అధికారిక సమాచారం ప్రకారం కనీసం 1,800 మందిని అరెస్టు చేశారు. ఒక్క పారిస్‌లోనే రికార్డు స్థాయిలో 855 అరెస్టులు జరిగాయి, వారిలో దాదాపు మూడోవంతు మైనర్లు కావడం ఆందోళన కలిగించే విషయం. 500 మందికి పైగా పోలీసులు, జెండార్మ్‌లు, అగ్నిమాపక సిబ్బంది గాయపడినట్టు అంతర్గత వ్యవహారాల మంత్రి లారెంట్ న్యూనెజ్ తెలిపారు. పారిస్‌లో ఒక నిరసనకారుడు గుండె ఆగి మరణించగా, సెయింట్–ఎటియెన్‌లో చిన్న పేలుడు పదార్థం పేలి ఒక యువకుడు చేతిని కోల్పోయాడు. సుమారు 1,500 దుకాణాలు, వ్యాపార సంస్థలు దెబ్బతిన్నాయని రిటైల్ సమాఖ్య వెల్లడించింది. ఒక్క క్యారీఫోర్ సంస్థకే 50కి పైగా స్టోర్లకు నష్టం జరిగి, అనేక మిలియన్ యూరోలమేర నష్టం వాటిల్లిందని దాని సీఈఓ అంచనా వేశారు. మరుసటి రోజు ఉదయం దుకాణదారులు చీపుర్లతో రోడ్లపైకి వచ్చి గాజు ముక్కలు తొలగించారు. గోడలపై "ధనవంతులపై పన్నులు పెంచండి" వంటి నినాదాలు కనిపించాయి. "ఇక్కడ యుద్ధం జరిగినట్టుగా ఉంది" అని ఒక పారిస్ వాసి అన్న మాటే ఆ దృశ్యాలను ఒక్క వాక్యంలో చెబుతోంది. దోపిడీకి గురైన ఒక దుకాణ యజమాని మాటలు మరింత ఆలోచింపజేస్తాయి. తమ దుకాణాన్ని దోచుకున్నవారు పాఠశాలల గురించో, జీవన వ్యయం గురించో ఆందోళన చెందే నిరసనకారులు కాదని, ఆ గందరగోళాన్ని అవకాశంగా తీసుకున్న దొంగలన్నారు.

ఈ ఆగ్రహం ఒక్కరోజులో పుట్టింది కాదు. దీని మూలాలు పాఠశాల తరగతి గదుల్లో ఉన్నాయి. సెప్టెంబర్ 21న పారిస్ శివారులోని పేద ప్రాంతాల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నిరసనగా ఇది మొదలైంది. ఉపాధ్యాయుల కొరత, కిక్కిరిసిన తరగతులు, శిథిలావస్థలో ఉన్న భవనాలు విద్యార్థుల ప్రధాన ఫిర్యాదులు. పాఠశాలలకు 10 బిలియన్ యూరోలు కేటాయించాలని, విశ్వవిద్యాలయ ప్రవేశాల వ్యవస్థ అయిన "పార్కోర్సప్"ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్టోబర్ 6న దాదాపు 800 ఉన్నత పాఠశాలలు మూతపడ్డాయి. అక్టోబర్ 13న సుమారు 4.8 లక్షల మంది వీధుల్లోకి వచ్చారు. ప్రభుత్వం 3,000 మంది అదనపు ఉపాధ్యాయులను పంపుతామని ప్రకటించింది. పోలీసులు స్టన్ గ్రెనేడ్ల వాడకాన్ని నిలిపివేశారు. కానీ ప్రధాని సెబాస్టియన్ లెకోర్ను విద్యా బడ్జెట్‌ను భారీగా పెంచే డిమాండ్‌ను తోసిపుచ్చారు. 2027 బడ్జెట్‌లో విద్యకు అదనంగా 1.2 బిలియన్ యూరోలు ఇస్తున్నామని చెప్పారు. ఇక్కడే అసలు చిక్కు ఉంది. ఫ్రాన్స్ జాతీయ రుణం 1946 తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పదుల బిలియన్ల యూరోల పొదుపు చర్యలతో కూడిన కఠిన బడ్జెట్‌ను సిద్ధం చేస్తోంది. అంటే ఒకవైపు ప్రజలు ఎక్కువ ఖర్చు చేయమని అడుగుతున్నారు, మరోవైపు ఖజానా ఖర్చు తగ్గించమని చెబుతోంది. దీనికి జీవన వ్యయ భారం తోడైంది. మధ్యప్రాచ్య యుద్ధం వల్ల యూరప్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, ఇంధన ధరలు ఆకాశాన్ని తాకాయి. ఈ అసంతృప్తిని అందిపుచ్చుకుని, 2018–19లో ఇంధన పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమించిన "ఎల్లో వెస్ట్" ఉద్యమం విద్యార్థులతో చేతులు కలిపింది. కార్మిక సంఘాలు, రైతులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కూడా చేరారు. శనివారం జనసంఖ్య ఎల్లో వెస్ట్ ఉద్యమ గరిష్ఠ స్థాయిని దాటింది. అయితే 2023 పెన్షన్ సంస్కరణ వ్యతిరేక నిరసనల స్థాయికి మాత్రం చేరలేదు. ఆ ప్రభావం బెల్జియం, ఇటలీ, పోర్చుగల్ వంటి పొరుగు దేశాలకూ విస్తరించింది. బ్రసెల్స్‌లో యువత పోలీసులతో ఘర్షణ పడింది.

ఇప్పుడు అందరి కళ్లూ ప్రభుత్వ స్పందనపైనే ఉన్నాయి. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆదివారం దేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల "న్యాయమైన డిమాండ్లు", విధ్వంసం, దోపిడీకి పాల్పడినవారి చర్యల మధ్య స్పష్టమైన గీత గీశారు. హింసకు ఎలాంటి సమర్థనా లేదని, బాధ్యులను శిక్షిస్తామని, నష్టపోయిన వ్యాపారాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రధాని లెకోర్ను "మేము బెదిరిపోం" అని ప్రకటించి, హింసకు "అతివాద వామపక్ష" గ్రూపులను బాధ్యులను చేశారు. నష్టపరిహారం, బీమా, నిందితులపై న్యాయ చర్యల కోసం అత్యవసర మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. న్యాయ మంత్రి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. మరోవైపు పారిస్, మార్సెయ్, లియాన్ మేయర్లు పోలీసు బలగాల కేటాయింపుపై ప్రభుత్వాన్ని వివరణ కోరారు. ప్రతిపక్షాలు కూడా ఊరుకోలేదు. వామపక్ష నేత జీన్–లూక్ మెలెంచోన్ దోపిడీని ఖండిస్తూనే, ప్రభుత్వం పరిస్థితిని నిర్వహించిన తీరును విమర్శించారు. అధ్యక్ష ఎన్నికల్లో ముందంజలో ఉన్న మరీన్ లె పెన్ "అల్లరిమూకలు ప్రజల కొనుగోలు శక్తి కోసం చేసే ఉద్యమాన్ని విషపూరితం చేశాయి" అన్నారు. ఆరు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రతి పార్టీ ఈ సంక్షోభాన్ని రాజకీయ కోణంలోనే చూస్తోందనేది స్పష్టం.

సామాన్య ప్రజల దృష్టిలో విషయం సరళమైనది. ఆగ్రహానికి కారణమైన సమస్యలు నిజమైనవే, కానీ ఆ పేరుతో జరిగిన విధ్వంసం సమర్థనీయం కాదు. చరిత్రాత్మక భవనాలు కాలిపోయాయి, చిన్న వ్యాపారులు రోడ్డున పడ్డారు, లక్షలాది మంది శాంతియుతంగా వినిపించిన గొంతు కాలిన కార్లు, పగిలిన అద్దాల శబ్దంలో కలిసిపోయింది. హింస ఎప్పుడూ ఉద్యమం బలాన్ని తగ్గిస్తుంది, ప్రభుత్వానికి కఠిన చర్యలకు సాకు ఇస్తుంది. అదే సమయంలో ప్రజల ఆందోళనను కేవలం "శాంతిభద్రతల సమస్య"గా చూడటం కూడా పాలకులు చేసే తప్పే అవుతుంది. ఖజానా క్రమశిక్షణ ఎంత అవసరమో, బడి భవనాలు, ఉపాధ్యాయులు, ఇంధన ధరల వంటి ప్రజల రోజువారీ అవసరాలు కూడా అంతే ముఖ్యం. చర్చల బల్లపై సమాధానం వెతికే సంకల్పం ప్రభుత్వానికి, హింసను దూరం పెట్టే విజ్ఞత ఉద్యమకారులకు ఉంటేనే ఫ్రాన్స్ ఈ సంక్షోభం నుంచి బయటపడుతుంది. ఈ పరిణామం ప్రజాస్వామ్య దేశాలన్నిటికీ ఒక హెచ్చరిక కూడా! ■



మెదడు ఒక ఫోన్ లాంటిది. వంద యాప్‌లు ఒకేసారి తెరిచి ఉంటే, ఎంత ఛార్జ్ పెట్టినా అది వేడెక్కి నెమ్మదిస్తుంది. అప్పుడు మరింత నొక్కితే వేగం పెరగదు, హ్యాంగ్ అవుతుంది. కాబట్టి కొన్నిసార్లు చేయాల్సింది పరుగు కాదు, పాజ్. పనులను పక్కన పెట్టు, లోతుగా ఊపిరి పీల్చు, కాసేపు ఏమీ చేయకుండా కూర్చో. ఆ ఖాళీలోనే అలసిన మనసు రీస్టార్ట్ అవుతుంది, చెల్లాచెదురైన ఆలోచనలు ఒక్కచోట చేరతాయి. క్రమశిక్షణ ముఖ్యమే, కానీ అలసిన మనసుకు విశ్రాంతే మందు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# టెక్సాస్‌లో టోపీ... కాదు, టోపీ పేరిట బార్!




"టెక్సాస్‌లో అన్నీ పెద్దవే" అనే సామెతను అమెరికా ఈసారి అక్షరాలా నిరూపించింది. ఆస్టిన్‌లోని సర్క్యూట్ ఆఫ్ ది అమెరికాస్ రేస్ ట్రాక్‌లో, టెకోవాస్ సంస్థతో కలిసి నాలుగేళ్లు కష్టపడి ప్రపంచంలోనే అతిపెద్ద కౌబాయ్ టోపీని నిలబెట్టారు. ఫైబర్‌గ్లాస్, ఫోమ్, ఉక్కు చట్రంతో చేసిన ఈ టోపీ 43 అడుగుల వెడల్పు, 47 అడుగుల పొడవు, 17 అడుగుల ఎత్తు! గిన్నిస్ రికార్డు కూడా దక్కింది. అసలు మజా ఏమిటంటే, టోపీ కింద పూర్తిస్థాయి బార్ ఉంది. అంటే రేసు చూడటానికి వెళ్లినవాళ్లు ఎండకు తలదాచుకుంటారు, బయటకు వచ్చేసరికి తల తిరుగుతుంది!

# ఆయుష్షు మూలం మనసులోనే

దీర్ఘాయువు రహస్యం మనసులోనే దాగుందా? 115 ఏళ్ల వయసుతో ప్రపంచంలోనే అతి ఎక్కువకాలం జీవించి ఉన్న మహిళగా రికార్డు సృష్టించిన ఎథెల్ కేటర్‌హ్యామ్ ఇదే సూచిస్తున్నారు. వాదించక పోవటం.. ఎదుటివారు చెప్పింది విన్నా నచ్చింది చేయటమే తన దీర్ఘాయువు సూత్రమన్నది ఆమె నమ్మకం. ఇది మామూలు విషయంగా అనిపించినా ఇందులో ప్రశాంతత, ఆత్మ గౌరవం ధ్వనిస్తుండటం గమనార్హం. భావోద్వేగాల అదుపుతోనే ఇది సాధ్యం. దీనికీ దీర్ఘాయుష్షుకూ సంబంధం ఉంటుండటం మరింత విశేషం.

శారీరకంగా జబ్బులు లేకపోవటమే కాదు. మానసికంగానూ బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు. అప్పుడే చురుకుగా, హాయిగా జీవితాన్ని ఆస్వాదించగలం. కుటుంబ, సామాజిక సంబంధాలతో ఉన్నతిని సాధించగలం. ఇక్కడే భావోద్వేగాలను అదుపులో పెట్టుకునే నైపుణ్యం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రోజూ మనకు ఎన్నో భావాలు కలుగుతుంటాయి. అవి అంతటితోనే ఆగిపోవు. ఉద్వేగాలనూ కలిగిస్తాయి. అన్నిసార్లూ ఇవి సానుకూలంగానే ఉండకపోవచ్చు. ప్రతికూల భావోద్వేగాలూ మనసును అతలాకుతలం చేస్తుండొచ్చు. ఉదాహరణకు– పరీక్షలో ఫెయిల్ అయ్యారనుకోండి. లేదూ కోరుకున్న ఉద్యోగం దొరక లేదనుకోండి. మనసంతా విచారంతో నిండిపోతుంది. కొందరు దీన్ని తేలికగా తీసుకోవచ్చు. అంతటితోనే ముగింపు పలకొచ్చు. కొందరు విపరీతంగా స్పందించొచ్చు. నిరాశా నిస్పృహలకు లోనుకావొచ్చు. ఇలాంటి ప్రతికూల భావాలను, వీటికి స్పందించే తీరును సమన్వయం చేసుకోవటమే భావోద్వేగ నైపుణ్యం. అంటే భావాలను అర్థం చేసుకొని, వాటిని సమర్థంగా అదుపులో ఉంచుకోవటమన్నమాట. స్వీయ చైతన్యం కలిగుండటం, జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కొనే సామర్థ్యమూ దీనిలోని భాగమే. ఇది మానసిక ఆరోగ్యం మీదే కాదు, శారీరక ఆరోగ్యం మీదా ప్రభావం చూపుతుంది.



### ఆయుర్దాయానికి దన్ను ఇలా..

మనం ఆయుష్షును చాలావరకూ శారీరక ఆరోగ్యంతోనే ముడిపెట్టి చూస్తుంటాం. కానీ మానసిక ఆరోగ్యమూ గణనీయ పాత్ర పోషిస్తుంది. మానసికంగా బాగున్నవారు మరింత ఎక్కువ కాలం.. హాయిగా జీవించే అవకాశమున్నట్టు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇందులో భావోద్వేగాలను అదుపులో పెట్టుకునే నైపుణ్యం అడుగడుగునా సాయం చేస్తుంది. ఇంతకీ ఇదెలా ఆయుష్షును పెంచుతుంది?

**ఒత్తిడి దూరం:** భావోద్వేగాల అదుపుతో కార్టిజోల్ వంటి ఒత్తిడి హార్మోన్ల మోతాదులు, ప్రభావాలు తగ్గుతాయి. ఫలితంగా కుంగుబాటు, ఆందోళన, భయాల వంటివీ తగ్గుముఖం పడతాయి. ఇది గుండె, మెదడు వంటి కీలక అవయవాలకూ మేలు చేస్తుంది. తరచూ కుంగుబాటు వంటి వాటికి గురయ్యేవారికి గుండెపోటు, పక్షవాతం ముప్పులు 6 రెట్లు ఎక్కువ. భావోద్వేగాల అదుపుతో వీటి ముప్పు తగ్గుతుంది. పరోక్షంగా ఆయుర్దాయమూ పెరుగుతుంది.

**రోగనిరోధక బలం:** మానసిక దృఢత్వంతో రోగనిరోధక వ్యవస్థ కూడా మెరుగవుతుంది. వీరిలో యాంటీబాడీలను తయారుచేసే టి కణాల వంటివి చురుకుగా పనిచేస్తాయి. అందువల్ల బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల ముప్పు తక్కువ. ఇన్‌ఫెక్షన్లు దాడిచేసినా సమర్థంగా ఎదుర్కోగలుగుతారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నవారు జబ్బుల నుంచి 1.14 రెట్లు ఎక్కువ వేగంగా కోలుకుంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

**వాపు ప్రక్రియ తగ్గుముఖం:** కణ అంతర్గత వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) తగ్గటం మరో ముఖ్య విషయం. దీంతో మధుమేహం, అల్జీమర్స్, క్యాన్సర్ల వంటి జబ్బులు వచ్చే అవకాశమూ తగ్గుతుంది.

**జీవనశైలి:** మానసికంగా బాగున్నవారు వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తినటం వంటి మంచి జీవనశైలిని పాటిస్తుంటారు. ఇది మొత్తంగా ఆరోగ్యాన్నీ మెరుగు పరుస్తుంది.

**సర్దుబాటు సామర్థ్యం:** భావోద్వేగ నైపుణ్యం మూలంగా ఇతరులతో సర్దుకుపోయే స్వభావమూ మెరుగవుతుంది. దీంతో ఇంటా బయటా కలివిడితనం ఇనుమడిస్తుంది. కుటుంబ, స్నేహ సంబంధాలూ పెరుగుతాయి. ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల్లో రాణించటంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తారు. ఇవి మరింత మానసిక దృఢత్వానికీ తోడ్పడతాయి. ఇలా ఇదొక సానుకూల వలయంగా ప్రయోజనం కలిగిస్తుందన్నమాట.

### భావోద్వేగ నైపుణ్యాన్ని సాధించేదెలా?

**అవగాహన:** భావోద్వేగాలను గుర్తించటం, అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. అప్పుడే వీటిని అదుపులో ఉంచుకోవటానికి, పైచేయి సాధించటానికి మార్గం సుగమమవుతుంది. ఉదాహరణకు– ఇంతకుముందు ఎవరి మీదైనా కోపాన్ని ప్రదర్శించినప్పుడు ఎలాంటి అనుభవం ఎదురైంది? వాళ్లు ఎలా బాధపడ్డారు? తమకు ఎంత క్షోభ కలిగింది? అనేవి అవగతమైతే మున్ముందు భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవటానికి వీలుంటుంది.

**దయ, కరుణ:** మన చేతుల్లో లేనివాటికి చింతిస్తే ప్రయోజనం లేదు. దీంతో భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. కాబట్టి తమను తాము దయతో చూసుకోవటం, బలాలు, బలహీనతలను గుర్తించటం.. తమను తాము క్షమించుకోవటం సాధన చేయాలి.

**అన్యోన్య అనుబంధాలు:** ఇవి ఒడుదొడుకుల్లో తమకు ఒకరు తోడున్నారనే భరోసా ఇస్తాయి. ధైర్యంగా ముందుకు సాగేలా ప్రోత్సహిస్తాయి. మానసిక సమతుల్యత చేకూరుస్తాయి. భావోద్వేగాలను నియంత్రించుకునే సామర్థ్యమూ అబ్బుతుంది.

**లక్ష్య సాధన:** జీవితంలో ఏదో ఒక ఆశయం, లక్ష్యం పెట్టుకోవటం.. దాన్ని సాధించటానికి ప్రయత్నిస్తుంటే తృప్తి కలుగుతుంది. పెద్ద పెద్ద లక్ష్యాలే కానక్కర్లేదు. చిన్నవైనా సరే. వీటిని క్రమంగా సాధిస్తుంటే ఆత్మ విశ్వాసం, నిబ్బరం ఇనుమడిస్తాయి.

**ధ్యానం:** గాఢంగా, లయబద్ధంగా శ్వాస తీసుకుంటూ చేసే ప్రాణాయామం, మనసు మీద దృష్టిని నిలిపే ధ్యానం ఎంతో మేలు చేస్తాయి. ఇవి ప్రతికూల ఆలోచనల నుంచి మనసును మళ్లించి సానుకూల భావాలు పెంపొందేలా చేస్తాయి.

**డైరీ రాయటం:** తాము ఎదుర్కొన్న ఘటనలను డైరీలో రాసుకుంటే ఎప్పుడెలా ప్రవర్తించామో అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది. అసమంజసంగా స్పందించటాన్ని తెలుసుకోవటానికి, మున్ముందు అలా ప్రవర్తించకుండా ఉండటానికి దోహదం చేస్తుంది.

**సృజనాత్మక కళలు:** సంగీతం, చిత్ర లేఖనం, చేత్తో బొమ్మలు చేయటం వంటి సృజనాత్మక కళలు మనసులోని భావాలను బయటకు వెల్లడించటానికి, భారం తగ్గటానికి తోడ్పడతాయి. ప్రతికూల భావోద్వేగాలు క్రమంగా సానుకూలంగా మారతాయి.

**సమయ పాలన:** పనులను ఆయా వేళల ప్రకారం చేయటం, సమయాన్ని సమర్థంగా వినియోగించుకోవటం మరో మంచి పద్ధతి. ఇది అనవసరంగా ఆదుర్దా పడకుండా, భావోద్వేగాలు గతి తప్పకుండా చూసుకోవటానికి తోడ్పడుతుంది.

**ఓపెన్ మైండ్:** అవతలివారి కోణాన్ని వినటం వల్ల అభిప్రాయ భేదాలను గుర్తించటానికి వీలవుతుంది. భావోద్వేగాలు అదుపు తప్పకుండా చూసుకోవచ్చు. ఎదుటి వ్యక్తికి కనీస గౌరవం ఇవ్వటం ద్వారా వ్యక్తిగత దూషణలకు దిగకుండా చూసుకోవచ్చు.

# ఆహార నిద్ర



నిద్రలేమి రకరకాల జబ్బులకు దారితీస్తుంది. అందువల్ల కంటి నిండా నిద్ర పట్టేలా చూసుకోవటం తప్పనిసరి. మరి మంచి నిద్ర కావాలంటే? ఆహార అలవాట్లను మార్చుకొని చూడండి. అవును, మన ఆహార అలవాట్లు.. తినే తిండిలోని పోషకాలు, కొవ్వులు, చక్కెర, పీచు వంటివన్నీ నిద్ర తీరుతెన్నుల్లో పాలు పంచుకుంటాయి మరి. కొందరు పడుకోగానే వెంటనే నిద్రలోకి జారుకుంటారు. కొందరికి ఎంత ప్రయత్నించినా ఒక పట్టాన నిద్ర పట్టదు. కొందరు చిన్న అలికిడికే మేల్కొంటే మరికొందరు పెద్ద చప్పుళ్లయినా గాఢంగా నిద్రపోతుంటారు. నిద్ర విషయంలో రకరకాల అంశాలు పాలు పంచుకుంటాయి. వీటిల్లో ఆహార అలవాట్లూ ఒకటి. పడుకునే ముందు కడుపు నిండా తినటం వంటివి నిద్రకు భంగం కలిగిస్తే.. అరటిపండు తింటే కమ్మటి నిద్రకు దోహదం చేస్తుంది. అలాంటి కొన్ని జాగ్రత్తలు ఇవిగో..

### సాయంత్రం వేళ కెఫీన్‌కు దూరం

మగతను వదిలించుకోవటానికో, ఉత్సాహంగా ఉండటానికో చాలామంది కాఫీ, టీ తాగేస్తూనే ఉంటారు. కానీ, వీటిల్లోని కెఫీన్ నిద్ర మీద ప్రభావం చూపుతుందనే విషయం మీకు తెలుసా? అడినోసిన్ అనే రసాయనాన్ని అడ్డుకోవటం ద్వారా కెఫీన్ అప్రమత్తంగా ఉండేలా చూస్తుంది. అసలు విషయం ఏంటంటే పగటిపూట ఒంట్లో పేరుకుపోయే అడినోసిన్ రాత్రిపూట నిద్ర వచ్చేలా చేస్తుంది. కెఫీన్ దీన్ని అడ్డుకోవటం వల్ల రాత్రి నిద్ర పట్టటం కష్టమవుతుంది. కెఫీన్ ప్రభావం సుమారు ఆరు గంటల వరకూ ఉంటుంది. అంటే సాయంత్రం 5 గంటలకు కాఫీ, టీ తాగితే దాని ప్రభావం రాత్రి 11 గంటల వరకు ఉంటుందన్నమాట. ఇది రాత్రి నిద్ర తగ్గేలా చేస్తుంది. పడుకోవటానికి ఆరు గంటల ముందు 400 మి.గ్రా. కెఫీన్ తీసుకున్నవారిలో మొత్తంగా గంట నిద్ర తగ్గుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

కాబట్టి నిద్ర పట్టక సతమతమయ్యేవారు సాయంత్రం వేళల్లో కెఫీన్‌తో కూడిన టీ, కాఫీ, కూల్‌డ్రింకుల వంటివి తాగకపోవటం మంచిది.

### ట్రిప్టోఫాన్ వరం

కంటి నిండా నిద్ర పట్టటానికి ట్రిప్టోఫాన్ బాగా ఉపయోగపడుతుంది. ఇదొక అమైనో ఆమ్లం. ఆహారం నుంచి లభించే ఇది మెదడులో సెరటోనిన్, మెలటోనిన్‌గా మారుతుంది. ఈ రసాయనాలు నిద్రలో కీలక పాత్ర పోషిస్తాయి. త్వరగా నిద్ర పట్టడానికే కాకుండా రాత్రంతా గాఢంగా నిద్రపోవటానికీ మెలటోనిన్ తోడ్పడుతుంది. మనకు ఆనందం, సంతోషం కలగటానికి దోహదం చేసే సెరటోనిన్ నిద్ర–మెలకువల తీరునూ నియంత్రిస్తుంది.

అరటిపండు, బాదం, జీడిపప్పు, పిస్తా, బార్లీ, దంపుడు బియ్యం, చియా గింజలు, పప్పులు, గుమ్మడి విత్తనాలు, సాల్మన్ చేపలు, టోఫు, అక్రోట్లు, పాలు, పెరుగు, గుడ్డు తెల్లసొన వంటి వాటి నుంచి ట్రిప్టోఫాన్ దండిగా లభిస్తుంది. అలాగని ఇవి వెంటనే నిద్ర ముంచుకొచ్చేలా చేస్తాయని కాదు. వీటిని ఆహారంలో ఒక భాగం చేసుకుంటే క్రమంగా మంచి ఫలితం కనిపిస్తుందన్న మాట.

### పండ్లు, కూరగాయల మేలు

నిద్ర బాగా పట్టేలా చూసుకునే మార్గాల్లో ఒకటి పండ్లు, కూరగాయలు మరింత ఎక్కువగా తినటం. వీటిల్లో సెరటోనిన్, మెలటోనిన్‌తో పాటు మెగ్నీషియం, విటమిన్ బి6, ఫోలేట్ వంటి సూక్ష్మ పోషకాలూ దండిగా ఉంటాయి. ఇవన్నీ నిద్ర బాగా పట్టటానికి తోడ్పడేవే. వీటితో పీచు కూడా దండిగా లభిస్తుంది. అధిక పీచుతో కూడిన ఆహారం తీసుకునేవారు మరింత గాఢంగా నిద్ర పోతున్నట్టూ పరిశోధనలు చెబుతున్నాయి. బాగా శుద్ధి చేసిన పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకున్న స్త్రీలు నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. అందువల్ల ఆహార ఉత్పత్తులు, తీపి పదార్థాలు, పానీయాలకు బదులు ఇలాంటి సహజ పదార్థాలు తీసుకోవటం మంచిది.

అరటిపండ్లు, చెర్రీ, అనాస, పాలకూర, టమోటాల్లో పీచు, సంక్లిష్ట పిండి పదార్థాలు, సెరటోనిన్, మెలటోనిన్, మెగ్నీషియం, విటమిన్ బి6 వంటివి దండిగా ఉంటాయి.

### నిద్రకు ముందు మద్యం వద్దు

కొంతమంది రాత్రిపూట మద్యం తాగితే మంచి నిద్ర పడుతుందని భావిస్తుంటారు. కానీ, దీంతో ముంచుకొచ్చే మత్తు తాత్కాలికమే. మద్యం మొదట్లో మత్తును కలిగించినా ఆ తర్వాత నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. మధ్యలో మెలకువ వచ్చేలా చేస్తుంది. ఇలా గాఢ నిద్రకు భంగం కలిగిస్తుంది.

ఒకవేళ అంతగా అలవాటుంటే పడుకోవటానికి ముందు తాగకుండా చూసుకోవాలి. పడుకునే వేళకు శరీరంలోంచి దీని ప్రభావం తొలగిపోయేంత సమయం ఇవ్వాలి. మద్యంతో నిద్ర దెబ్బతింటున్నట్టు ఇప్పటికే గమనిస్తే మోతాదును తగ్గించుకోవటానికైనా ప్రయత్నించాలి. అంటే మద్యం అలవాటును మొత్తంగా మానెయ్యటం సాధ్యం కాకపోతే తాగే సమయం, మోతాదులనైనా మార్చుకోవటం మంచిదన్నమాట.

### కడుపు కాస్త ఖాళీగా..

పడుకునే ముందు కడుపు నిండా తింటే నిద్రకు భంగం కలిగే అవకాశముంది. రాత్రిపూట జీర్ణక్రియ మందగిస్తుంది మరి. పడుకునేముందు ఎక్కువగా తింటే సరిగా జీర్ణం కాదు. తిన్న తర్వాత వెల్లకిలా పడుకోవటం మూలంగా ఛాతీలో మంట, గొంతులోకి ఆమ్లం ఎగదన్నుకు రావటం వంటి సమస్యలూ తలెత్తుతాయి. ఇవీ నిద్రకు ఆటంకం కలిగిస్తాయి.

కాబట్టి రాత్రిపూట కడుపు కాస్త ఖాళీగా ఉంచుకోవటం మంచిది. అలాగే తిన్న వెంటనే పడుకోకుండా చూసుకోవాలి. రెండు, మూడు గంటలైనా వ్యవధి ఇవ్వాలి. కాస్త అటూఇటూ తిరగాలి. వీలైనంత వరకూ రాత్రి 8 గంటలలోపు భోజనం చేస్తే మంచిది. తిన్నది కాస్త జీర్ణం అయ్యాక పడుకుంటే నిద్ర బాగా పడుతుంది.

# అలసటతో టీమిండియా.. సొంతగడ్డపై కివీస్ జోరు.. తొలి టీ20 రసవత్తరం

**భారత్-న్యూజిలాండ్ మధ్య ఐదు టీ20ల సిరీస్**

**తొలి మ్యాచ్‌కు క్రైస్ట్‌చర్చ్ ఆతిథ్యం**

**బుమ్రా, హార్దిక్ లేకుండానే భారత్ బరిలోకి**

**ప్రయాణ అలసట నుంచి కోలుకోవాల్సిన టీమిండియా**

**న్యూజిలాండ్ పేస్ బౌలింగ్‌తో భారత్‌కు సవాల్**



న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు భారత్ సిద్ధమైంది. అయితే, ఈసారి టీమిండియాకు ఎదురయ్యేది సాధారణ సవాల్ కాదు. వరుస ప్రయాణాలతో అలసట, కీలక ఆటగాళ్ల గైర్హాజరు, పేసర్లకు అనుకూలించే పరిస్థితులు.. ఇలా ఎన్నో సవాళ్లు భారత జట్టుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు, సొంతగడ్డపై బలంగా కనిపిస్తున్న న్యూజిలాండ్ తొలి మ్యాచ్‌లోనే పైచేయి సాధించాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్న తొలి టీ20 ఆసక్తికరంగా మారింది.

భారత జట్టుకు ఈ సిరీస్‌కు ముందు విశ్రాంతి తీసుకునే అవకాశం పెద్దగా లభించలేదు. అక్టోబర్ 3న జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన అనంతరం, అక్టోబర్ 6 నుంచే వెస్టిండీస్‌తో స్వదేశంలో టీ20 సిరీస్ ఆడింది. బెంగళూరులో అక్టోబర్ 17న జరగాల్సిన నిర్ణయాత్మక మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో ఆ సిరీస్ 2-2తో ముగిసింది. అక్కడి నుంచి న్యూజిలాండ్‌కు చేరుకున్న భారత జట్టుకు క్రైస్ట్‌చర్చ్‌లో ఒక్కటే ప్రాక్టీస్ సెషన్ లభించింది. ప్రయాణ అలసట నుంచి కోలుకోవడం ఆటగాళ్లకు కీలకం కానుంది.జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు దూరంగా ఉండటం భారత్‌కు ఎదురుదెబ్బ. టెస్టు సిరీస్‌ను దృష్టిలో పెట్టుకుని బుమ్రాకు విశ్రాంతి ఇచ్చారు. హార్దిక్ మాత్రం మార్చిలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. దీంతో బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ జట్టు కూర్పుపై మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.మరోవైపు, న్యూజిలాండ్ జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఇటీవల భారత్‌లో టెస్టు, వన్డే సిరీస్‌లను గెలిచిన ఆ జట్టు.. ఈసారి తమ ప్రధాన ఆటగాళ్లలో ఎక్కువమందితో బరిలోకి దిగుతోంది. గాయాల కారణంగా మార్క్ చాప్‌మన్, రచిన్ రవీంద్ర అందుబాటులో లేకపోయినా, ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, డెవాన్ కాన్వే వంటి ఆటగాళ్లతో టాప్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. ముఖ్యంగా స్వదేశంలో అలెన్ దూకుడు భారత్ బౌలర్లకు పరీక్షగా మారొచ్చు. జాకబ్ డఫీ, మాట్ హెన్రీ, ఆడమ్ మిల్నే, లాకీ ఫెర్గూసన్ వంటి పేసర్లు న్యూజిలాండ్ బౌలింగ్‌కు అదనపు బలం.భారత తుది జట్టు ఎంపిక కూడా ఆసక్తికరంగా మారింది. ఆసియా వెలుపల స్పిన్ ఆల్‌రౌండర్ల ప్రభావం తగ్గే అవకాశం ఉండటంతో నమన్ ధీర్ స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబె ఇద్దరికీ అవకాశం కల్పించే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. తిరిగి జట్టులోకి వచ్చిన భువనేశ్వర్ కుమార్ ఆడే అవకాశం ఉంది. ఫిట్‌నెస్ సాధించిన వరుణ్ చక్రవర్తి స్థానంలో మూడో పేసర్‌గా ప్రిన్స్ యాదవ్‌ను తీసుకుంటారా అన్నది చూడాలి.

క్రైస్ట్‌చర్చ్‌లో మ్యాచ్ ప్రారంభమయ్యే రాత్రి 8 గంటల సమయానికి చలి పెరిగే అవకాశం ఉంది. సీజన్ ప్రారంభంలో ఉండే తాజా పిచ్ పేసర్లకు సహకరించొచ్చు. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం కూడా ఉండే అవకాశంతో టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

అయితే, గత రికార్డులు భారత్‌కు కొంత ఊరటనిస్తున్నాయి. న్యూజిలాండ్‌తో జరిగిన చివరి రెండు ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లను భారత్ గెలుచుకుంది. 2020 జనవరి నుంచి ఇప్పటివరకు ఇరు జట్ల మధ్య పూర్తయిన 20 టీ20ల్లో 16 మ్యాచ్‌ల్లో టీమిండియాదే విజయం. వ్యక్తిగతంగా ఇషాన్ కిషన్‌పైనా అందరి దృష్టి ఉంది. ఈ క్యాలెండర్ ఏడాదిలో టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న 1,164 పరుగుల రికార్డును అధిగమించాలంటే ఇషాన్ మరో ఏడు పరుగులు చేయాలి. ప్రేక్షకులతో కిక్కిరిసే హాగ్లీ ఓవల్‌లో ఈ రికార్డు సాధిస్తాడా అన్నది ఆసక్తికరం.మ్యాచ్ వివరాలు: అక్టోబర్ 22, గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం. వేదిక క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్. టీవీలో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానళ్లలో, ఆన్‌లైన్‌లో సోనీ ూ×ం యాప్, వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారం చూడవచ్చు.

# టీమిండియాకు భారీ ఎదురుదెబ్బ.. ఐపీఎల్ 2027 వరకు హార్దిక్ పాండ్యా దూరమేనా?

- **ఐపీఎల్ 2027 వరకు ఆటకు పాండ్యా దూరమయ్యే అవకాశం ఉందంటున్న నివేదికలు**
- **బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స**
- **మరో మూడు వారాల తర్వాత జాగింగ్ ప్రారంభించే అవకాశం**
- **ఆ తర్వాత ఎనిమిది వారాల్లో పరుగుల సాధన క్రమంగా పెంపు**
- **శ్రీలంక, జింబాబ్వే సిరీస్‌లకు దూరమయ్యే ప్రమాదం**



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అభిమానులకు నిరాశ కలిగించే వార్త. అతడు మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఓ నివేదిక వెల్లడించింది. కాలి కండరాల లోపలి భాగంలో ఏర్పడిన స్ట్రెస్ గాయం నుంచి కోలుకుంటున్న హార్దిక్.. వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్న ఐపీఎల్ 2027 వరకు పోటీ క్రికెట్‌కు దూరంగా ఉండొచ్చని తెలిపింది. అయితే, అతడి పునరాగమనంపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.ప్రస్తుతం హార్దిక్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస చికిత్స తీసుకుంటున్నాడు. 'దైనిక్ జాగరణ్' కథనం ప్రకారం.. అతడి వైద్య నివేదికలను గత వారం డాక్టర్ దిన్‌షా పార్దివాలా పరిశీలించారు. వైద్యుల సూచనల మేరకు దశలవారీగా ఫిట్‌నెస్ సాధించే కార్యక్రమాన్ని హార్దిక్ కొనసాగిస్తున్నాడు.పునరావాస ప్రణాళిక ప్రకారం మరో మూడు వారాల తర్వాత అతడు నెమ్మదిగా జాగింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. ఆ తర్వాతి ఎనిమిది వారాల్లో పరుగెత్తే సమయాన్ని, తీవ్రతను క్రమంగా పెంచనున్నారు. గాయంపై మళ్లీ ఒత్తిడి పడకుండా స్ట్రెంత్ ట్రైనింగ్‌ను కూడా జాగ్రత్తగా పెంచుతున్నారు. పూర్తి స్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించడానికి ఎంత సమయం పడుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేదు.

ఈ పరిస్థితి కొనసాగితే డిసెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంకతో వన్డేలు, టీ20ల సిరీస్‌కు హార్దిక్ దూరమయ్యే అవకాశం ఉంది. జనవరి 3 నుంచి జరగనున్న జింబాబ్వేతో వన్డే సిరీస్‌లోనూ ఆడకపోవచ్చని నివేదిక పేర్కొంది. ఇప్పటికే అతడు న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక కాలేదు. 2026లోనూ హార్దిక్ పలు సిరీస్‌లకు దూరమయ్యాడు. అతడు చివరిసారిగా ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరఫున మే నెలలో మ్యాచ్ ఆడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో చివరిసారిగా మార్చిలో జరిగిన 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో కనిపించాడు. హార్దిక్ త్వరగా కోలుకోవడం టీమిండియాకు కీలకం కానుంది.

# ఐపీఎల్ రికార్డుల వీరుడు.. ఇక ఢిల్లీ స్పిన్నర్లకు గురువు



భారత మాజీ లెగ్ స్పిన్నర్, ఐపీఎల్ రికార్డుల వీరుడు అమిత్ మిశ్రా తన క్రికెట్ ప్రస్థానంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. రాబోయే 2027 ఐపీఎల్ సీజన్‌కు గాను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా అతడు నియమితులయ్యాడు.

విశేషమేమిటంటే.. 2008లో తన ఐపీఎల్ ప్రయాణాన్ని ఏ జట్టుతో అయితే ప్రారంభించాడో, అదే జట్టుతో ఇప్పుడు కోచింగ్ కెరీర్‌ను మొదలుపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ అధికారికంగా ప్రకటించింది.ఈ నియామకం పై అమిత్ మిశ్రా సంతోషం వ్యక్తం చేశాడు. "ఢిల్లీ దిల్ వాలోం కీ హై (ఢిల్లీది పెద్ద మనసు). నేను తొలిసారి ఐపీఎల్ ఆడినప్పుడు ఢిల్లీ జట్టులో భాగమయ్యాను. ఇప్పుడు నా కోచింగ్ కెరీర్‌ను కూడా ఢిల్లీతోనే ప్రారంభిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఢిల్లీ నా గుండెచప్పుడు. ఎన్నో ఏళ్లుగా ఢిల్లీ అభిమానులు ఎదురుచూస్తున్న ఆనందాన్ని, విజయాన్ని వారికి అందించడానికి గట్టిగా ప్రయత్నిస్తాం" అని ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో మిశ్రా పేర్కొన్నాడు.43 ఏళ్ల అమిత్ మిశ్రా 2025 సెప్టెంబర్‌లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్‌లో కోచింగ్ బాధ్యతలు చేపట్టడం అతనికి ఇదే తొలిసారి. తన ఫ్లైటెడ్, స్లో లెగ్ బ్రేక్‌లతో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన మిశ్రాకు ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు ఉంది. ఈ లీగ్ చరిత్రలో మూడు హ్యాట్రిక్‌లు (2008, 2011, 2013) సాధించిన ఏకైక బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. 2008 నుంచి 2024 వరకు ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ (గతంలో డేర్‌డెవిల్స్), డెక్కన్ ఛార్జర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 162 మ్యాచ్‌లలో 7.37 ఎకానమీ రేటుతో 174 వికెట్లు పడగొట్టాడు.గత కొన్ని సీజన్లుగా పేలవ ప్రదర్శనతో నిరాశపరుస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్, జట్టును పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడింది. గత సీజన్‌లో ఆరో స్థానంలో నిలిచిన ఈ జట్టు ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవలేదు. ఈ క్రమంలోనే భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని కొత్త హెడ్ కోచ్‌గా నియమించింది.



**దుర్గా అష్టమి మరియు మహా నవమి కోసం సీరత్ కపూర్ బ్లాక్ కోచర్‌లో స్టన్స్**

# దేవరకొండ ఇప్పుడు చేయాల్సిందేంటి?



ఒక సినిమా కోసం హీరో ఎంత కష్టపడ్డారనేది మెయిన్. కానీ ఆ కష్టం ప్రేక్షకులకు ఎంతవరకు నచ్చిందన్నదే రిజల్ట్ డిసైడ్ చేస్తుంది. విజయ్ దేవరకొండ విషయంలో ఇదే డిస్కస్ చేసుకోవాల్సిన విషయం. రణబాలిలో ఆయన యాక్టింగ్ కు మంచి మార్కులే పడుతున్నా.. కొన్ని విషయాల్లో మాత్రం ప్రేక్షకులకు అసంతృప్తి ఉంది. దీంతో నటుడిగా నిరూపించుకున్న ఆయన.. సెలక్షన్ లో జాగ్రత్తగా ఉండాల్సిన సమయం వచ్చిందా అనే ప్రశ్న వినిపిస్తోంది.

నిజానికి రణబాలిలో విజయ్ దేవరకొండ తన పాత్ర కోసం చాలా కష్టపడ్డారు. రోల్ కు తగ్గట్టుగా కనిపించడం దగ్గర నుంచి యాక్షన్ సీన్స్, డైలాగులు చెప్పే విధానం వరకు తనదైన ముద్ర వేశారు. రణబాలి రోల్ లో చూపించిన ఇంటెన్సిటీ సినిమాకు మెయిన్ అసెట్ గా నిలిచింది. రష్మిక మందన్నా కూడా తన పాత్రకు న్యాయం చేశారు. డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ సెలెక్ట్ చేసుకున్న బ్యాక్ డ్రాప్, రూపొందించిన కొన్ని సీన్స్, క్లైమాక్స్ అట్రాక్ట్ చేస్తున్నాయి.

అయితే మంచి స్టోరీ ఉన్నంత మాత్రాన సినిమా మొత్తం ప్రేక్షకులను కట్టిపడేయలేదని ఆ మూవీ మరోసారి గుర్తు చేసింది. కొన్ని చోట్ల స్టోరీ స్లోగా సాగడం, సినిమా రన్ టైమ్ ఎక్కువగా అనిపించడం ఇబ్బందిగా మారాయి. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను చూపించే క్రమంలో వైలెన్స్ కూడా ఎక్కువైంది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలోనూ మరింత స్ట్రాంగ్ వర్క్ ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంటే విజయ్ యాక్టింగ్ కంటే, ప్రేక్షకులకు నచ్చేలా మూవీ తీర్చిదిద్దడంలోనే సమస్య ఉందని చెప్పొచ్చు. అయితే విజయ్ కు ప్రస్తుతం మంచి అవకాశాలున్నాయి. రౌడీ జనార్దన, దర్శకుడు శౌర్యువ్ తో చేయనున్న సినిమాలు లైనప్ లో ఉన్నాయి. ఆ రెండు చిత్రాలు వేర్వేరు బ్యాక్ డ్రాప్స్ లో రూపొందుతున్నాయి. ఒకటి గ్రామీణ వాతావరణంలో సాగే మాస్ యాక్షన్ కథ కాగా, మరొకటి ఎమోషన్స్ తో కూడిన ఫాంటసీ స్టోరీ.అందుకే విజయ్ ఇప్పుడు చేయాల్సింది కొత్త స్టోరీలను ఎంచుకోవడం మాత్రమే కాదు.

అందులో కొన్ని మార్పులు చేసుకోవాలి. స్టోరీలో కొత్తదనం ఉందా, తన పాత్రకు స్ట్రెంత్ ఎంత, ప్రేక్షకులు మొదటి నుంచి చివరి వరకు ఆసక్తిగా చూస్తారా అనే విషయాలను ముందుగానే పరిశీలించాలి. దర్శకుడి ఆలోచన ఎంత బాగున్నా, అది స్క్రీన్ పై అంతే స్ట్రాంగ్ కనిపించేలా ఉండాలి. ఇక విజయ్ లో కొత్త కథలు చేయాలనే ఆసక్తి కనిపిస్తుంది, మంచి క్రేజ్ కూడా ఉంది.

ఆ రెండింటినీ కలిపి ముందుకు వెళ్లడం ఇప్పుడు చాలా అవసరం. కేవలం భారీ బ్యాక్ డ్రాప్, కొత్త లుక్, ఎక్కువ యాక్షన్ ఉంటే సినిమా సక్సెస్ అవుతుందని అనుకోకూడదు. స్ట్రాంగ్ స్టోరీ, ఎమోషన్స్, స్పీడ్ స్క్రీన్ ప్లే కూడా అంతే ముఖ్యం. అందుకే ఇప్పుడు ఆయన ఫోకస్ పెట్టాల్సింది స్టోరీల సెలక్షన్ తోపాటు అవి స్క్రీన్ పై ఎలా చూపిస్తారనే విషయంపై కూడా. విజయ్ నెక్స్ట్ సినిమాల్లో చిన్న చిన్న ఛేంజెస్ చేసుకుంటే కచ్చితంగా మంచి రిజల్ట్ రావొచ్చు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965